మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 5-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 2 Volume:2 | సంచిక: 68 Issue: 68

05 సెప్టెంబర్ 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:06 సూర్యాస్తమయం - సా. 6:23 తిథి నవమి రా. 9:53 వరకు తరువాత దశమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం మృగశిర రా. 9:28 వరకు తరువాత ఆరుద్ర యోగం వజ్ర మ. 12:41 వరకు కరణం తైతుల ఉ. 11:04 వరకు గరజ రా. 9:53 వరకు వర్జ్యం తె. 5:19 నుండి ఉ. 6:48 వరకు దుర్ముహూర్తం ఉ. 7:44 నుండి ఉ. 8:33 వరకు రాహుకాలం ఉ. 9:10 నుండి ఉ. 10:42 వరకు యమగండం మ. 1:46 నుండి మ. 3:19 వరకు గుళికాకాలం ఉ. 6:06 నుండి ఉ. 7:38 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:30 నుండి తె. 5:18 వరకు అమృత ఘడియలు మ. 1:16 నుండి మ. 2:45 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:50 నుండి మ. 12:39 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial



## రేపు కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ఎల్పీ భేటీ

### ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకావాలని ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): ఈ నెల 7నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించాలని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఈ నెల 6న ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో మధ్యాహ్నం లంచ్ తర్వాత 2 గంటలకు ప్రారంభమయ్యే సంయుక్త సమావేశానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకావాలని పార్టీ అధినేత శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ తరఫున లేవనెత్తాల్సిన అంశాలు, ప్రభుత్వ నిర్ణయాలపై స్పందన, ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే విధానం తదితర అంశాలపై కేసీఆర్ వారికి దిశానిర్దేశం చేయనున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన నేపథ్యంలో జరుగుతున్న సమావేశాలను దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్ శాసనసభా పక్షం సమన్వయంతో వ్యవహరించేలా కేసీఆర్ పలు కీలక ఆదేశాలు, సూచనలు చేయనున్నారు.

# భారతాన.. వెట్టి చాకిరి..!

## వేతనం లేని శ్రమ..

### వారానికి 16 గంటలు ఉచితంగా పని

### దేశంలో 24 శాతం మంది పరిస్థితి ఇదే

### పీపుల్ ఎట్ వర్క్ 2026 నివేదికలో వెల్లడి

లంచ్ టైంలోనూ తినకుండా డ్యూటీ..
పని వేళలు ముగిసినా ఉద్యోగ విధుల్లోనే..
కార్యాలయ సమయం దాటినా ఆఫీసులోనే..
అయినా, పైసా ఆమ్దానీ అదనంగా అందదు..
ఇదీ.. భారతదేశంలో ఉద్యోగుల దుర్భర స్థితి





(ఈవార్తలు - స్పెషల్ డెస్క్)

ఉద్యోగం అంటే వేతనం కోసం పనిచేయడం. కానీ పని వేళలు ముగిసిన తర్వాత కూడా ఉద్యోగ విధుల్లోనే కొనసాగాల్సి వస్తే? భోజన విరామంలోనూ పని చేయడం, కార్యాలయ సమయం దాటిన తర్వాత కూడా విధులు నిర్వర్తించడం వంటి అదనపు శ్రమకు వేతనం అందకపోతే? భారత్‌లో ఇలాంటి పరిస్థితి పెద్ద సంఖ్యలో ఉద్యోగులను వెంటాడుతున్నట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. ఏడీపీ రిసెర్చ్ రూపొందించిన 'పీపుల్ ఎట్ వర్క్ 2026' నివేదిక ప్రకారం, వారానికి 16 గంటలు లేదా అంతకంటే ఎక్కువ సమయం వేతనం లేకుండా పనిచేస్తున్న ఉద్యోగుల వాటా భారత్‌లో 24 శాతంగా ఉంది. ఈ విషయంలో అధ్యయనం చేసిన 36 దేశాల మార్కెట్లలో భారత్ మొదటి స్థానంలో నిలిచింది. 2025లో నిర్వహించిన ఈ సర్వేలో 36 మార్కెట్లకు చెందిన 39,000 మందికి పైగా వయోజన ఉద్యోగులు పాల్గొన్నారు. భారత్‌లో మరో 40 శాతం మంది ఉద్యోగులు వారానికి 6 నుంచి 15 గంటల వరకు వేతనం తరువాయి 2 వ పేజీలో...



## నిప్పులు కక్కుతూ.. నింగిలోకి!

### ఈవోఎస్-05 ప్రయోగం విజయం

### శ్రీహరికోట నుంచి ప్రయోగం

### 36 వేల కి.మీ ఎత్తు నుంచి నిఘా

శ్రీహరికోట, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. శుక్రవారం తెల్లవారుజామున 2:55 గంటలకు, శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా ఈవోఎస్-05 (జిశాట్-1ఏ) ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. ఈ ప్రయోగంతో భారత అంతరిక్ష సామర్థ్యం మరో మెట్టు పైకెక్కినట్లయింది. భూస్థిర కక్ష్య -2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,666 |
| వెండి (కిలో): | రూ.2,55,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,379 |




## వెయ్యి రోజులుగా కేసీఆర్ మొద్దు నిద్ర

### బీఆర్ఎస్ అధినేత రాజీనామా చేయాలె

#### ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ వివాదాస్పద ఫ్లెక్సీ.. రేపు ఇందిరా పార్క్ వద్ద 'మహా ధర్నా'

తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు తీరును నిరసిస్తూ ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మోతా రోహిత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వివాదాస్పద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గాంధీభవన్ నుంచి గన్‌పార్క్ వరకు ర్యాలీలో భాగంగా.. కేసీఆర్ ఫొటోతో కూడిన కుంభకర్ణుడి భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు దూరంగా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ వెయ్యి రోజులుగా మొద్దు నిద్రలో ఉన్నారని విమర్శించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు రాని కేసీఆర్ ఇప్పటికైనా ఎమ్మెల్యే పదవికి రాజీనామా -2 వ పేజీలో...

## సైబర్ దొంగలపై సీబీఐ 'చక్ర'

### 20 రాష్ట్రాల్లో ఏకకాలంలో తనిఖీలు.. 89 ప్రాంతాల్లో సోదాలు.. ముగ్గురి అరెస్టు

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 'డిజిటల్ అరెస్ట్' సైబర్ నేరాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఉక్కుపాదం మోపింది. 'ఆపరేషన్ చక్ర-6'లో భాగంగా 20 రాష్ట్రాల్లోని 89 ప్రాంతాల్లో సీబీఐ ఏకకాలంలో విస్తృత తనిఖీలు చేపట్టింది. సైబర్ బాధితుల నుంచి కొల్లగొట్టిన సొమ్మును స్వీకరించడం, దారి మళ్లించడం, పంపిణీ చేయడంలో కీలక పాత్ర పోషించిన ముగ్గురు నిందితులను సీబీఐ పోలీసులు అరెస్ట్ చేశారు.




న్యూఢిల్లీ: పోలీసులు, ప్రభుత్వ అధికారులమని చెప్పి నకిలీ గుర్తింపు కార్డులు చూపి జనాల్ని డిజిటల్ అరెస్టులు చేస్తూ ఈ సైబర్ ముఠాలు అనేక అరాచకాలకు పాల్పడుతున్నాయి. బాధితుల్ని భయభ్రాంతులకు గురిచేసి వారి నుంచి కోట్లాది రూపాయలు గుంజుతున్నాయి. ఈ ముఠాలపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఈ తాజా తనిఖీలు చేపట్టింది. కాగా, వివిధ రాష్ట్రాల నుంచి సీబీఐ - 2 వ పేజీలో...



## కొండా సురేఖ భద్రత తొలగింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): మాజీ మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక భద్రతను పూర్తిగా ఉపసంహరించుకుంది. మంత్రివర్గం నుంచి ఆమెను తొలగించిన మరుసటి రోజే ఈ చర్యలు తీసుకోవడం గమనార్హం. మంత్రి హోదాలో ఆమెకు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంతో పాటు, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ తరువాయి 2 వ పేజీలో...

## తాగునీటికే కృష్ణా జలాలు

### కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు కీలక ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రం విద్యుత్ ఉత్పత్తికి నీటిని వినియోగించడం వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని వినియోగించాలని ఇటు తెలంగాణ, అటు ఏపీని ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం- 2014 లోని 11వ షెడ్యూల్‌లో 2, 3 పేరాలను అనుసరించి నీటి వినియోగం ఉండాలి అని సూచించింది. సాగు నీరు-తాగునీరు-విద్యుత్ ఉత్పత్తికి విరుద్ధ పరిస్థితులు వస్తే, తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కేఆర్ఎంబీ స్పష్టం చేసింది. తెలంగాణ సర్కారు విద్యుత్ ఉత్పత్తికి శ్రీశైలం నీటిని వినియోగించడంపై కేఆర్ఎంబీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

## విశ్వవాణి



ఒకే రక్త నమూనాతో పలు రకాల క్యాన్సర్లను గుర్తించే రక్త పరీక్షను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ రక్త పరీక్షకు 3 డాలర్లలోపే (సుమారు రూ.270) ఖర్చవుతుందట. క్యాన్సర్ కణాల్లో కనిపించే ఓఆర్ఎఫ్1పీ అనే ప్రోటీన్‌ను అత్యంత సున్నితమైన సాంకేతికతతో గుర్తించడం ఈ పరీక్ష ప్రత్యేకత అని పేర్కొన్నారు.

## రేషన్ అమ్ముకుంటే కార్డు కట్



### అర్హులకు ఇళ్లు రాకపోతే సర్పంచులకు పదవీగండం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర హెచ్చరిక

ప్రభుత్వం సంక్షేమ పథకాల కింద అందిస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు అక్రమంగా అమ్ముకుంటే వారి రేషన్ కార్డులను రద్దు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా హెచ్చరించారు. పేదల ఆకలి తీర్చడానికి ఉద్దేశించిన బియ్యాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

ఖమ్మం, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): శుక్రవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పూతాని తండాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి ప్రసంగించారు. కొంతమంది లబ్ధిదారులు ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యాన్ని బయట అమ్ముకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని మంత్రి తెలిపారు. ఇది చాలా తప్పుడు

## ఉల్లి ఘాటు.. అల్లం కూటు!



### వంటింటిపై ధరల పిడుగు

### ఆకాశాన్నంటిన ఉల్లి, అల్లం, వెల్లుల్లి

### నెలలోనే రెట్టింపు స్థాయికి ఉల్లి ధర

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): ఉల్లి, అల్లం, వెల్లుల్లి ధరలు ఆకాశాన్నంటుతూ నెలవారీ బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. ఉల్లి ధర నెల వ్యవధిలోనే రెట్టింపు కావడంతో వినియోగదారులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. హైదరాబాద్ మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో నెల క్రితం క్వింటాల్ రూ. 2,000 ఉన్న మహారాష్ట్ర ఉల్లి ధర, ఇప్పుడు ఏకంగా రూ. 5,000 మార్కును తాకింది. ఏడాది కాలంలో ఇదే గరిష్ఠ ధర అని వ్యాపారులు చెబుతున్నారు. ఉల్లి బాటలోనే అల్లం, వెల్లుల్లి కూడా పయనిస్తున్నాయి. కర్ణాటక నుంచి వచ్చిన అల్లం క్వింటాల్ రూ. 16,000 పలుకుతుండగా, మధ్యప్రదేశ్ నుంచి దిగుమతి అయిన వెల్లుల్లి ధర క్వింటాల్‌కు రూ. 19,000గా నమోదైంది. దీంతో బహిరంగ తరువాయి 2 వ పేజీలో...

## 9 రోజుల తర్వాత బతికొచ్చారు!

### నేపాల్ మహా విషాదంలో అద్భుతం

### సొరంగం నుంచి ఇద్దరు ప్రాణాలతో బయటికి

### త్రిశూలి జల విద్యుత్ ప్రాజెక్ట్ వద్ద ఘటన

ఖట్మండు: నేపాల్‌లో జల ప్రళయం సృష్టించిన మహా విషాదంలో ఒక అద్భుతం చోటుచేసుకుంది. వరదలు ముంచెత్తిన తొమ్మిది రోజుల తర్వాత, బురద, శిథిలాలతో పూర్తిగా కూరుకుపోయిన ఒక జల విద్యుత్ ప్రాజెక్ట్ సొరంగం నుంచి ఇద్దరు కార్మికులను సహాయక సిబ్బంది సజీవంగా బయటకు తీశారు. ఈ ఘటనతో ఇంకా అనేక సొరంగాల్లో చిక్కుకుపోయిన వందలాది మంది కార్మికులు కూడా ప్రాణాలతో బయటపడతారనే తరువాయి 2 వ పేజీలో...



## రాశి ఫలాలు

5.9.2026

మేషం: కొన్ని వ్యవహారాలలో సొంత నిర్ణయాలు అంతగా కలిసిరావు. చేపట్టిన పనులు ముందుకు సాగవు. వ్యాపారాలు సాదాసీదాగా సాగుతాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు వలన తగిన విశ్రాంతి ఉండదు. కుటుంబ సభ్యులతో స్వల్ప విభేదాలు ఉంటాయి. ఆర్థిక ఇబ్బందులు వలన నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు.

వృషభం: వ్యాపారాలలో ఆశించిన పురోభివృద్ధి కలుగుతుంది. చేపట్టిన పనులలో శ్రమ ఫలిస్తుంది. నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి బయట పడగలుగుతారు నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. కొన్ని వ్యవహారాలలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

మిధునం: స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. దూరపు బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. విందువినోదాది కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

కర్కాటకం: వ్యాపారపరంగా తీసుకున్నటువంటి నిర్ణయాలు నష్టాలను మిగులుస్తాయి. దూర ప్రయాణాలు వాయిదా వేస్తారు. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఉద్యోగాలలో అధికారుల నుండి సమస్యలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాల్లో తొందరపాటు నిర్ణయాలు పనిచేయవు. కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి.

సింహం: చేపట్టిన పనుల్లో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. పనులలో వ్యయప్రయాసలు అధికమౌతాయి. బంధువుల నుంచి ఋణ ఒత్తిడులు అధికమౌతాయి. నిరుద్యోగులకు నిరుత్సాహం తప్పదు. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపార ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి.

కన్య: కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. వివాదాలకు సంబంధించి కీలక సమాచారం సేకరిస్తారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వ్యాపార, ఉద్యోగాలు ఉత్సాహవంతంగా సాగుతాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

తుల: వృత్తి వ్యాపారాలు కొంత నిరాశ పరుస్తాయి. బంధుమిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ఉద్యోగాలలో అదనపు పని భారం వలన తగిన విశ్రాంతి ఉండదు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన పనుల్లో ప్రతిబంధకాలు ఉంటాయి.

వృశ్చికం: స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. చిన్ననాటి మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. వ్యాపారాలు మరింత అనుకూలిస్తాయి. ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది. విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు.

ధనస్సు: చేపట్టిన పనులు నత్తనడకన సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు వ్యయప్రయాసలతో కాని పూర్తి కావు. వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. వృత్తి ఉద్యోగాలలో కొన్ని ఇబ్బందులు తప్పవు. బంధుమిత్రుల నుంచి ఒత్తిడులు అధికమవుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

మకరం: వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. ఆప్తుల నుంచి కీలక సమాచారం అందుతుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో ఉన్నటువంటి సమస్యలు పరిష్కారమవుతాయి. సంతానానికి నూతన విద్యావకాశాలు లభిస్తాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

కుంభం: ఉద్యోగాలలో ఆశించిన పదవులు పొందగలుగుతారు. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయి. వ్యాపారాలలో చికాకులు తొలగుతాయి. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. ఆప్తుల నుంచి శుభవార్తలు వింటారు. నూతన వాహనయోగం ఉన్నది.

మీనం: వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగాలలో ఇతరుల నుండి ఊహించని సమస్యలు ఎదురవుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు అంతగా కలిసిరావు. వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

# భారతాన.. వెట్టి చాకిరి..!

మొదటి పేజీ తరువాయి

లేకుండా అదనపు పని చేస్తున్నట్లు వెల్లడైంది. అంటే, భారత్‌లో సర్వేలో పాల్గొన్న ఉద్యోగుల్లో దాదాపు మూడింట రెండొంతుల మంది వారానికి కనీసం ఆరు గంటలపాటు అదనపు వేతనం లేని పనికి సమయం కేటాయిస్తున్నారు. అదనపు వేతనం లేకుండా చేసే పనిగా భోజన విరామ సమయంలో పని చేయడం, కార్యాలయ సమయం ముగిసిన తర్వాత కూడా విధుల్లో కొనసాగడం వంటి వాటిని ఏడీపీ నిర్వచించింది.



**ప్రధాన మార్కెట్లలో భారత్ ప్రత్యేక స్థానం**

వారానికి 16 గంటలు లేదా అంతకంటే ఎక్కువ సమయం వేతనం లేకుండా పనిచేస్తున్న వారి వాటా భారత్‌లో 24 శాతంగా ఉండగా, టర్కీలో 23 శాతం, ఆస్ట్రియాలో 21 శాతం, అమెరికాలో 20 శాతం నమోదైంది. మరోవైపు చెక్ రిపబ్లిక్‌లో ఈ వాటా కేవలం 4 శాతంగా ఉంది. చైనా, తైవాన్, జపాన్‌లలో ఇది 6 శాతం చొప్పున నమోదైంది. 6 నుంచి 15 గంటల వరకు వేతనం లేని అదనపు పని చేస్తున్న వారి విషయంలోనూ భారత్ అత్యధిక వాటా ఉన్న దేశాల్లో ఒకటిగా నిలిచింది. భారత్‌తో పాటు ఇండోనేషియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లలో 40 శాతం మంది ఈ వర్గంలో ఉన్నారు

ఉద్యోగ హోదా, వేతనం లేని అదనపు పనికి మధ్య బలమైన సంబంధం ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. సంస్థలో ఉన్నత స్థాయికి వెళ్లే కొద్దీ పని వేళలు దాటిన తర్వాత కూడా పనిచేసే అవకాశం పెరుగుతోంది. ఉన్నతస్థాయి మేనేజర్లు, సీనియర్ నాయకుల్లో సగం మంది వారానికి కనీసం ఆరు గంటలు వేతనం లేకుండా అదనపు పని చేస్తున్నట్లు తెలిపారు. వారిలో 20 శాతం మంది వారానికి 16 గంటలు లేదా అంతకంటే ఎక్కువ సమయం అదనపు వేతనం లేకుండా పనిచేస్తున్నారు. సాధారణ ఉద్యోగుల్లో కనీసం ఆరు గంటల అదనపు పని చేస్తున్న వారి వాటా 26 శాతం కాగా, 16 గంటలు లేదా అంతకంటే ఎక్కువ అదనపు పని చేస్తున్న వారు 9 శాతంగా ఉన్నారు.

**ఇంటి నుంచి పనిచేసేవారిపైనా ఒత్తిడి**

పని చేసే ప్రదేశం కూడా వేతనం లేని అదనపు పనిపై ప్రభావం చూపుతోంది. ఇంటి నుంచి పనిచేసే ఉద్యోగుల్లో 13 శాతం మంది వారానికి 16 గంటలు లేదా అంతకంటే ఎక్కువ సమయం అదనపు వేతనం లేకుండా పనిచేస్తున్నట్లు వెల్లడైంది. మిశ్రమ విధానంలో, కార్యాలయం నుంచి పనిచేసే ఉద్యోగుల్లో ఈ వాటా 12 శాతం చొప్పున ఉంది. అదనంగా ఎక్కువ గంటలు పనిచేయడం వల్ల ఉద్యోగుల ఉత్పాదకత తప్పనిసరిగా పెరగదని ఏడీపీ నివేదిక స్పష్టం చేసింది. వేతనం లేని అదనపు పని గంటలు పెరిగే కొద్దీ, తమ సామర్థ్యానికి తగ్గట్టుగా పనిచేయలేకపోతున్నామని చెప్పే ఉద్యోగుల సంఖ్య కూడా పెరిగింది. ఈ ప్రభావం ముఖ్యంగా ఉన్నతస్థాయి మేనేజర్లు, అత్యున్నత కార్యనిర్వాహకుల్లో ఎక్కువగా కనిపించింది. అదనపు పని గంటలు పెరిగే కొద్దీ ఉద్యోగుల్లో ఒత్తిడి కూడా పెరిగింది. అదే సమయంలో ఉద్యోగంలో సంతృప్తిగా, అభివృద్ధి చెందుతున్నామనే భావన తగ్గినట్లు నివేదిక పేర్కొంది. అయితే, వారానికి 16 గంటలు లేదా అంతకంటే ఎక్కువ అదనపు పని చేస్తున్న ఉద్యోగుల్లో తమ ఉద్యోగంతో పూర్తిగా అనుసంధానమై ఉన్నామనే భావన, తమ పనికి అర్థవంతమైన విలువ ఉందనే అభిప్రాయం కూడా ఎక్కువగా కనిపించింది. అదే సమయంలో అధికంగా వేతనం లేని అదనపు పని చేస్తున్న ఉద్యోగులు మరో ఉద్యోగం కోసం ప్రయత్నించే అవకాశం కూడా ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా ఉన్నతస్థాయి మేనేజర్లు, కార్యనిర్వాహకుల్లో ఈ ధోరణి స్పష్టంగా కనిపించింది. దీంతో ఉద్యోగంపై అధిక నిబద్ధత ఉన్నంత మాత్రాన ఒత్తిడి తగ్గుతుందని చెప్పలేమని, నిరంతర అదనపు పని చివరకు ఉద్యోగ మార్పు ఆలోచనలకు కూడా దారితీయవచ్చని నివేదిక సూచిస్తోంది.

**ఉద్యోగుల పరిస్థితి ఇలా..**

| అంశం | శాతం |
|---|---|
| భారత్‌లో వారానికి 16 ప్లస్ గంటలు వేతనం లేకుండా పనిచేసేవారు | 24% |
| భారత్‌లో వారానికి 6-15 గంటలు అదనపు పని చేసేవారు | 40% |
| ప్రపంచవ్యాప్తంగా 16 ప్లస్ గంటలు అదనపు పని చేసేవారు | 12% |
| ప్రపంచవ్యాప్తంగా 6-15 గంటలు అదనపు పని చేసేవారు | 26% |
| ప్రపంచవ్యాప్తంగా 0-5 గంటలు అదనపు పని చేసేవారు | 62% |
| టర్కీ - 16 ప్లస్ గంటలు | 23% |
| ఆస్ట్రియా - 16ప్లస్ గంటలు | 21% |
| అమెరికా - 16 ప్లస్‌గంటలు | 20% |
| చెక్ రిపబ్లిక్ - 16ప్లస్ గంటలు | 4% |
| చైనా - 16ప్లస్ గంటలు | 6% |
| జపాన్ - 16ప్లస్ గంటలు | 6% |
| ఉన్నత మేనేజర్లు/సీనియర్ నాయకులు - 6ప్లస్ గంటలు | 50% |
| ఉన్నత మేనేజర్లు/సీనియర్ నాయకులు - 16ప్లస్ గంటలు | 20% |
| సాధారణ ఉద్యోగులు - 6ప్లస్ గంటలు | 26% |
| సాధారణ ఉద్యోగులు - 16ప్లస్ గంటలు | 9% |
| ఇంటి నుంచి పనిచేసేవారు - 16ప్లస్ గంటలు | 13% |

# వెయ్యి రోజులుగా కేసీఆర్ మొద్దు నిద్ర

మొదటి పేజీ తరువాయి

చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, మాజీ కార్పొరేటర్లు రమణ గౌడ్, సంతోష్ గుప్తా, సంగీత యాదవ్, సీనియర్ నాయకులు పండిట్ తివారీ, కనయ్య లాల్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరిదర్, రాహుల్‌తో పాటు యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది. ఈ మేరకు సెప్టెంబర్ 6వ తేదీ (ఆదివారం) హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద భారీ 'మహా ధర్నా'కు హస్తం పార్టీ నిర్ణయించింది. ఆదివారం నాటి కాంగ్రెస్ మహా ధర్నాను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ శనివారం ఉదయం 9 గంటలకు సన్నాహక సమావేశం నిర్వహించబోతోంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుల ఆధ్వర్యంలో జరగబోయే ఈ సమావేశానికి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, ఇతర ముఖ్య నేతలు హాజరుకాబోతున్నారు. ధర్నాను విజయవంతం చేసేందుకు కార్యాచరణ, ఏర్పాట్లపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. కేసీఆర్ రాజీనామా చేయాలంటూ ఒత్తిడి తెచ్చేలా అసెంబ్లీ సెషన్ కంటే ముందే కాంగ్రెస్ చేస్తున్న ఈ మహాధర్నా ఆసక్తికరంగా మారింది.



# ఉల్లి ఘాటు.. అల్లం కూటు!

మొదటి పేజీ తరువాయి

మార్కెట్‌లో కిలో వెల్లుల్లి ధర రూ. 250 దాటిపోయింది. ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం వర్షాభావ పరిస్థితులతో దిగుబడులు తగ్గడమేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మహారాష్ట్రలో గత జూన్, జులై నెలల్లో కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బతింది. మరోవైపు, కర్ణాటక, కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక ఉల్లి సాగు గణనీయంగా పడిపోయింది. ఫలితంగా, రోజుకు 20 వేల క్వింటాళ్లు రావాల్సిన మలక్‌పేట మార్కెట్‌కు ప్రస్తుతం కేవలం 5 వేల క్వింటాళ్ల ఉల్లి మాత్రమే వస్తోంది. ధరల పెరుగుదల వినియోగదారులకు భారంగా మారినప్పటికీ, రైతులకు మాత్రం ఆనందాన్నిస్తోంది. గతంలో గిట్టుబాటు ధర లేక పంటను రోడ్లపై పారబోసిన రైతులు, ఇప్పుడు మంచి ధర దక్కుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో కొత్త పంట మార్కెట్‌కు వచ్చే వరకు ధరలు తగ్గకపోవచ్చని, ఈ భారం తప్పదని వ్యాపారులు చెబుతున్నారు.

# కొండా సురేఖ భద్రత తొలగింపు

మొదటి పేజీ తరువాయి

వింగ్ పరిధిలోని ప్రత్యేక గన్‌మన్లను ప్రభుత్వం తక్షణమే వెనక్కి పిలిపించింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం వెలువడిన కొన్ని గంటల్లోనే ఆమె భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను రద్దు చేస్తూ అధికారులు చర్యలు చేపట్టారు. దీనితో ఆమె అధికారిక కాన్వాయ్, ఎస్కార్ట్ భద్రత పూర్తిగా నిలిచిపోయాయి. ప్రోటోకాల్ నిబంధనల ప్రకారమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఒక వ్యక్తి మంత్రి పదవిలో లేనప్పుడు, వారికి కేటాయించిన ప్రత్యేక భద్రతను ఉపసంహరించడం సాధారణ ప్రక్రియ అని అధికారులు పేర్కొంటున్నారు. అయితే, మంత్రి పదవి నుంచి తొలగించిన వెంటనే ఇంత వేగంగా భద్రతను వెనక్కి తీసుకోవడంపై రాజకీయ విశ్లేషకులు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# నిప్పులు కక్కుతూ.. నింగిలోకి!

మొదటి పేజీ తరువాయి

నుంచి పనిచేయనున్న భారత్ తొలి ఇమేజింగ్ శాటిలైట్ ఇదే కావడం ఈ ప్రయోగం ప్రత్యేకత. భూమికి దాదాపు 36,000 కిలోమీటర్ల ఎత్తులో ఉంటూ, భూభ్రమణంతో పాటే ఇది తిరుగుతుంది. దీనివల్ల భారత ఉపఖండం, పరిసర ప్రాంతాలపై నిరంతరం ఒక కన్ను వేసి ఉంచడం సాధ్యమవుతుంది. సాధారణంగా లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లోని ఉపగ్రహాలు ఒక ప్రాంతంపై నుంచి పరిమిత సమయం మాత్రమే వెళ్తాయి. కానీ, ఈవోఎస్-05 స్థిరంగా ఒకే ప్రాంతాన్ని పర్యవేక్షించగలదు. ఈ ఉపగ్రహం ప్రతి 30 నిమిషాలకు ఒకసారి మొత్తం భారత భూభాగాన్ని చిత్రీకరించగలదు. ప్రకృతి వైపరీత్యాలైన తుఫానులు, వరదలు, అడవుల్లో కార్చిచ్చులను ముందుగా పసిగట్టడంలో, వాతావరణ మార్పులను గమనించడంలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. వ్యవసాయం, జలవనరుల నిర్వహణ, సరిహద్దు ప్రాంతాల పర్యవేక్షణలో కూడా ఇది కీలక పాత్ర పోషించనుంది. ఐదేళ్ల క్రితం, అంటే 2021 ఆగస్టులో, జీఎస్ఎల్‌వీ-ఎఫ్10 రాకెట్ సాంకేతిక వైఫల్యం కారణంగా జిశాట్-1 (ఈవోఎస్-03) మిషన్ విఫలమైన విషయం తెలిసిందే. ఆ లోటును పూడ్చుతూ, ఇప్పుడు ఈవోఎస్-05ను విజయవంతంగా ప్రయోగించి ఇస్రో తన సత్తా చాటింది.

# రేషన్ అమ్ముకుంటే కార్డు కట్

మొదటి పేజీ తరువాయి

పద్ధతని, పేదల కోసం ఉద్దేశించిన పథకాలను దుర్వినియోగం చేయవద్దని హితవు పలికారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి, వారి రేషన్ కార్డులను రద్దు చేయడానికి కూడా వెనుకాడబోమని తేల్చి చెప్పారు. ఇక, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి, ముఖ్యంగా గుడిసెల్లో నివసించే వారికి తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రి అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ఇళ్ల కేటాయింపులో పార్టీలకు అతీతంగా పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సర్పంచులు తమ పదవులు కోల్పోవాల్సి వస్తుందని గట్టిగా హెచ్చరించారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదై పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, తీవ్ర కరువు పరిస్థితులు ఎదురుకావచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని తుమ్మల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే పామాయిల్ పంట సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. పామాయిల్ సాగు చేసేవారికి అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని భరోసా ఇచ్చారు. రైతులకు భరోసా కల్పిస్తూ, రఘునాథపాలెం మండలానికి శుక్రవారం రాత్రికే సాగునీటిని విడుదల చేస్తున్నామని, రైతులు మరుసటి రోజు మోటార్లు ఆన్ చేసుకోవచ్చని తెలిపారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్నవారికి బోరుబావుల అనుమతులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న పోడు భూముల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, మండలంలో రూ.75 కోట్లతో 200 డంపర్ రోడ్లతో పాటు పొలాలకు వెళ్లే దారులను నిర్మిస్తామని ప్రకటించారు. విద్య యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన ఆయన, త్వరలోనే ఒక స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, అటవీ శాఖ అధికారి అనుజ్ అగర్వాల్, భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# 9 రోజుల తర్వాత బతికొచ్చారు!

మొదటి పేజీ తరువాయి

ఆశలు బలపడ్డాయి. నేపాల్‌లోని త్రిశూలి 3ఏ జల విద్యుత్ ప్రాజెక్టులో ఆగస్టు 26న సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా కార్మికులు సొరంగంలో చిక్కుకుపోయారు. అప్పటి నుంచి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. తొమ్మిది రోజుల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఇద్దరిని ప్రాణాలతో కాపాడటం అక్కడివారిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. బురదతో నిండిపోయిన కార్మికులను సహాయక సిబ్బంది తమ భుజాలపై మోసుకుని బయటకు తీసుకువస్తున్న దృశ్యాలు స్థానిక టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఒక వీడియోలో, కార్మికుడిని సొరంగం నుంచి బయటకు తీయగానే సహాయక సిబ్బంది ఆనందంతో కేరింతలు కొట్టడం కనిపించింది. మరో చిత్రంలో, బురదలో కూరుకుపోయిన మరో వ్యక్తిని స్ట్రెచర్‌పై తరలిస్తుండగా, అతను చేతులు జోడించి నమస్కరించడం హృదయాలను కదిలించింది. సహాయక చర్యల్లో ప్రాణాలతో బయటపడిన వారిని నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (ఎన్ఈఏ) మెకానికల్ ఫోర్‌మెన్ సంజయ్ షా (30), త్రిశూలి-3 'ఏ' ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ కబీర్ మహర్జన్ (45)గా నేపాల్ హోం మంత్రి సుడాన్ గురుంగ్ గుర్తించారు. 'బీబీసీ' కథనం ప్రకారం.. సంజయ్ షా మాట్లాడలేని స్థితిలో ఉండటంతో అతన్ని వెంటనే హెలికాప్టర్‌లో రాజధాని ఖాట్మండుకు సమీపంలోని బత్తర్‌కు తరలించారు. మరోవైపు, కబీర్ మహర్జన్ స్పృహలోనే ఉన్నాడని, అతన్ని ఖాట్మండులోని చౌనీ మిలటరీ ఆసుపత్రికి తరలిస్తున్నామని అతని భార్య తెలిపారు. అటు.. విపత్తులో ఇప్పటివరకు 1,259 మంది మరణించగా, 5,000 మందికి పైగా గల్లంతయ్యారని విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. సరిహద్దుకు ఆవలి వైపున ఉన్న టిబెట్‌లో 21 మంది చనిపోగా, 541 మంది గల్లంతైనట్లు చైనా ప్రకటించింది. నేపాల్‌లోని 12 జల విద్యుత్ ప్రాజెక్టుల నుంచి దాదాపు 900 మంది కార్మికులు గల్లంతయ్యారని, వారిలో సుమారు 500 మంది సొరంగాల్లోనే చిక్కుకుని ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఆరు హైడ్రోపవర్ ప్రాజెక్టుల సొరంగాల్లో 150 మందికి పైగా కార్మికులు చిక్కుకున్నట్లు భావిస్తుండటంతో, వారిని కాపాడేందుకు భారీ ఎత్తున సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సొరంగాల్లోకి గాలిని పంపింగ్ చేస్తూ కార్మికులను ప్రాణాలతో కాపాడేందుకు ఇంజనీర్లు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

# సైబర్ దొంగలపై సీబీఐ 'చక్ర'

మొదటి పేజీ తరువాయి

స్వీకరించిన మూడు కీలక డిజిటల్ అరెస్ట్ కేసుల్లో బాధితులను నెలల తరబడి డిజిటల్‌గా బంధించి, మొత్తం రూ. 42.36 కోట్లు దండుకున్నారు. దీంతో ఫైనాన్షియల్, సాంకేతిక సమాచారాన్ని, బ్యాంకు ఖాతాల డేటాను విశ్లేషించిన తర్వాత సీబీఐ 89 ప్రాంతాల్లో దాడులు నిర్వహించింది. ఈ సోదాల్లో బ్యాంకు రికార్డులు, డిజిటల్ డివైజ్‌లు, కీలక ఆధారాలను స్వాధీనం చేసుకుంది. ఈ నగదు ఎక్కడెక్కడికి మళ్లిందో తెలుసుకునేందుకు ఫోరెన్సిక్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ డిజిటల్ అరెస్ట్ వ్యవహారాలకు సంబంధించి హ్యాండ్లింగ్, మనీ లాండరింగ్‌లో పాల్గొన్న ముగ్గురిని సీబీఐ అరెస్ట్ చేసింది. ఆకాశ్ (హర్యానా): ఇతని ఖాతాలోకి రూ. 1.95 కోట్లు రాగా, అదే రోజు ఆ డబ్బును ఇతర ఖాతాలకు మళ్లించాడు. రాజా కర్మాకర్ (కోల్‌కతా): ఇతని కంపెనీ ఖాతాలోకి రూ. 1.5 కోట్ల మోసం సొమ్ము జమ అయింది. జ్యోతి రాణి: ఈమె తన ఖాతాలోకి వచ్చిన సొమ్ములో కొంత భాగాన్ని నగదు రూపంలో విత్‌డ్రా చేసి, మిగిలిన మొత్తాన్ని ఇతర ఖాతాలకు పంపిణీ చేసింది.

# ‘బిగ్ అప్‌డేట్’ పోస్టులు మాకు తెల్వదు

## సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు.. మాజీమంత్రి కొండా సురేఖ స్పష్టీకరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ, తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తన కుటుంబానికి సంబంధం లేని కొన్ని పోస్టులు వివిధ సోషల్ మీడియా వేదికలపై సర్క్యులేట్ అవుతున్నాయని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేదని శుక్రవారం ఆమె ‘ఎక్స్’ వేదికగా స్పష్టం చేశారు. “త్వరలో బిగ్ అప్‌డేట్”, “నిరీక్షణకు తెరపడనుంది” వంటి వ్యాఖ్యలతో ఉన్న పోస్టులు తన దృష్టికి వచ్చాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను సైతం ఆమె పంచుకున్నారు. మంత్రి పదవి నుంచి తనను తొలగించిన మరుసటి రోజే ఈ ప్రచారం జరగడం గమనార్హం. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం పొందిన తర్వాతే సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రెండు, మూడు రోజులుగా ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లతో సహా రాష్ట్ర నాయకత్వంతో అధిష్ఠానం జరిపిన సంప్రదింపుల తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు. గత నెలలో వరంగల్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు. సీఎం కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు కూడా చేశారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఓటు వేయాలని సీఎం పిలుపునివ్వడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకాశ్ రెడ్డి బరిలో ఉన్నా, తాను పరకాల నుంచి పోటీ చేస్తానని సుస్మిత ప్రకటించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ సంఘం సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయలేరని సురేఖ ఇచ్చిన సమాధానంపై పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. క్రమశిక్షణ సంఘం ఆమెపై కఠిన చర్యలకు సిఫార్సు చేసింది. కాగా, కేబినెట్ నుంచి తనను తొలగించడాన్ని కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సీఎం రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేసి తనను తొలగించారని ఆమె ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఈ కుట్ర వెనుక ఉన్నారని విమర్శించారు. అయితే, తాను, తన భర్త కొండా మురళి కాంగ్రెస్ పార్టీని వీడబోమని ఆమె స్పష్టం చేశారు.



బీజేపీలో చేరడం లేదా కొత్త పార్టీ పెట్టడం వంటి ప్రచారాన్ని తోసిపుచ్చుతూ “నేను ఎక్కడికీ వెళ్లడం లేదు” అని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్‌లో వర్గపోరు లేదు

**నాయకులంతా ఏకతాటిపై ఉన్నారు: వివేక్ వెంకటస్వామి**

మంచిర్యాల, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీలో ఎక్కడా వర్గపోరు లేదని, నాయకులంతా ఏకతాటిపై నిలిచి పార్టీ బలోపేతంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారని తెలంగాణ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజాదరణ పొందిందని వెల్లడించారు. రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన 22ఏ నిరోధిత భూముల వివాదంపై మంత్రి స్పందిస్తూ... ఈ సమస్య ముమ్మాటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాల వల్లే ఉత్పన్నమైందని మండిపడ్డారు. ఆనాటి జీవోను పునఃపరిశీలించి, సవరణలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని, ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా నిరోధిత జాబితా చిక్కులను త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రతికూలంగా ఉన్నప్పటికీ, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిబద్ధతతో నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలు, డిజైన్ లోపాల వల్లే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ఆరోపించిన మంత్రి వివేక్, ఈ వైఫల్యంపై మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు ప్రజలకు బహిరంగ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు ఉనికి కోసమే ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, గత పదేళ్ల స్వార్థ పాలనను ప్రజలు ఇంకా మరచిపోలేదని ఆయన వ్యాఖ్యానించారు.

## సురేఖను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం

**బీఆర్ఎస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదు: జగదీశ్ రెడ్డి**

**రాజగోపాల్ రెడ్డిని కూడా చేర్చుకోబోమని వ్యాఖ్య**

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఆమె బీఆర్ఎస్ లో చేరుతారని ఓవైపు, బీజేపీలో చేరుతారని మరోవైపు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సురేఖ కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరవచ్చనే ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదని, ఆమెను ఆఖరికి తెలంగాణ భవన్ గేటును కూడా తాకనివ్వబోమని తేల్చిచెప్పారు. పార్టీని వీడి అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లిన నేతలను తిరిగి చేర్చుకోబోమని.. వారిలో ఒకరిద్దరికి తప్ప మిగతా ఎవరికీ గులాబీ తలుపులు తెరిచేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో, కాంగ్రెస్ నుంచి ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారంటూ ఆయన సరికొత్త బాంబు పేల్చారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై కూడా జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజగోపాల్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నా ఆయనను బీఆర్ఎస్‌లోకి తీసుకోమని చెప్పారు. ఒకవేళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆయనకు మంత్రి పదవి కట్టబెడితే అది పూర్తిగా డబ్బులకు అమ్ముడుపోయినట్లేనని సంచలన ఆరోపణలు చేశారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన తీవ్ర ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేసిన ఆయన... రాబోయే శాసనసభ సమావేశాల్లో కాంగ్రెస్ వైఫల్యాలను, ముఖ్యంగా 22ఏ భూముల స్కామ్‌ను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పక్కా వ్యూహాలతో సిద్ధంగా ఉందని వెల్లడించారు.

## సర్టిఫికెట్లు లేకున్నా కొత్త పింఛనుకు అప్లై

**ఆన్‌లైన్, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే చాన్స్**

**వెరిఫికేషన్ సమయంలో మాత్రం సర్టిఫికెట్లు తప్పనిసరి**

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): కొత్త పింఛన్ కోసం ఎదురుచూస్తున్న అర్హులకు తెలంగాణ ప్రభుత్వం ఊరటనిచ్చింది. దరఖాస్తు సమయంలో ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా.. వాటి కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ముందుగా కొత్త పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం, సెర్ప్ వెల్లడించింది. దీంతో సర్టిఫికెట్లు రావడంలో జాప్యం కారణంగా దరఖాస్తు గడువు మిస్ అవుతుందేమోనని ఆందోళన చెందుతున్న వారికి ఉపశమనం లభించింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. అయితే దివ్యాంగుల సర్టిఫికెట్లు, కులం, ఆదాయం, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ఆలస్యం జరుగుతున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ, తహసీల్దార్ కార్యాలయాలు, సదరం క్యాంపుల నుంచి సర్టిఫికెట్లు పొందేందుకు సమయం పడుతుండటంతో అర్హులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్ల కోసం ఆగకుండా ముందుగా ఆన్‌లైన్‌లో లేదా నిర్దేశిత మీసేవా కేంద్రాల్లో కొత్త పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని సెర్ప్ స్పష్టం చేసింది. అయితే ఇక్కడే ఓ కీలక నిబంధన ఉంది. దరఖాస్తు చేసే సమయంలో ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా ఫర్వాలేదు. కానీ అధికారులు దరఖాస్తును పరిశీలించే సమయంలో మాత్రం సంబంధిత సర్టిఫికెట్లను తప్పనిసరిగా సమర్పించాలి. కాబట్టి దరఖాస్తు చేసుకున్న తర్వాత అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## కొండా సురేఖ తొలగింపు బాధాకరమే

**అయితే పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యం**

**హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు**

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం బాధ కలిగించేదే అయినా, పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ చాలా తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు. ఆమె వైఖరి అభ్యంతరకరంగా ఉందని, అందుకే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అధిష్ఠానం ఈ చర్యలు తీసుకుందని వివరించారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే చర్చించడానికి పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి వంటి అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని గుర్తుచేశారు. వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. “కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు” అని ఆయన అన్నారు. అయితే, కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో తప్పకుండా అవకాశాలు లభిస్తాయని సూచనప్రాయంగా చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.

## పొంగులేటి సంగతేంటి మరి?

**22ఏ పేరుతో రైతులకు పీడ: హరీశ్ రావు**



హైదరాబాద్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బంధీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

## అక్షరాస్యతపై తప్పుడు ప్రచారం: జగన్



తాడేపల్లి, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): ఏపీలో అక్షరాస్యత రేటు 2024లో 72.6శాతం నుంచి 2026 నాటికి 82.1శాతానికి పెరిగిందంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రంగా స్పందించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ‘ఎక్స్’ వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 2026 క్యాలెండర్ సంవత్సరం ఇంకా పూర్తి కానందున, అక్షరాస్యతకు సంబంధించి ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలను విడుదల చేయలేదని జగన్ స్పష్టం చేశారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్ఎస్ఎస్ఓ విడుదల చేసిన ‘పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే’ (పీఎల్ఎఫ్ఎస్) 2023-24 వార్షిక నివేదికను ఆయన ఉటంకించారు. దాని ప్రకారం.. 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో ఏపీలో ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత 72.6శాతంగా ఉందని, ఇదే 2018-19లో 69.1శాతంగా ఉండేదని గుర్తుచేశారు. అంతేకాకుండా, 2026 జులై 2న ప్రచురించిన పీఎల్ఎఫ్ఎస్ 2025 నివేదిక ప్రకారం.. 2025 జనవరి నుంచి 2025 డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్ర అక్షరాస్యత 71.4శాతంగా నమోదైందని తెలిపారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం తప్పుడు వాదనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం అత్యంత దురదృష్టకరమని జగన్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గి, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడీఐఎస్ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని, ఇది ఆందోళన కలిగించే విషయమని జగన్ అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యను మరింత అందుబాటులోకి ఎలా తీసుకురావాలనే దానిపై దృష్టి పెట్టాల్సింది పోయి, టీడీపీ కూటమి ప్రభుత్వం మోసపూరిత వ్యూహాలతో తప్పుడు ప్రచారాలు చేసుకోవడంలో నిమగ్నమైందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి తన శాఖపై ఎక్కువ సమయం కేటాయించాలి కానీ ‘రెడ్ బుక్ గవర్నెన్స్’ మీద కాదని లోకేశ్‌కు హితవు పలికారు.





## ప్రైవేట్ స్కూళ్లలో అడ్మిషన్లు.. కమిటీ ఏర్పాటు

విజయవాడ, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం అమలుకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లను నిరుపేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సి ఉండగా, ఈ విధానంలో ఉన్న మార్గదర్శకాలను సవరించి, పటిష్ఠంగా అమలు చేసేందుకు ఒక రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఈ రిజర్వేషన్ ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా చూడటమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేసేందుకు 16 మంది సభ్యులతో కూడిన కమిటీని ప్రభుత్వం నియమించింది. పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించనుండగా, సమగ్రశిక్షా ఎస్పీడీ కన్వీనర్‌గా ఉంటారు. వీరితో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల ప్రతినిధులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు కూడా ఈ కమిటీలో స్థానం కల్పించారు. ఈ ఏడాది జనవరిలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జారీ చేసిన ఆదేశాల నేపథ్యంలో ప్రస్తుత నిబంధనలను సవరించి, పకడ్బందీగా అమలు చేసేందుకు ఈ కమిటీ కృషి చేస్తుందని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కమిటీ త్వరలోనే సమావేశమై కొత్త మార్గదర్శకాలను ప్రభుత్వానికి సిఫార్సు చేయనుంది.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి ‘ఈవార్తలు’ నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి ‘ఈవార్తలు’. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## వీహెచ్ తర్వాత నేనే సీనియర్

**ఒక్క పోటుతో కూల్చేశారు: చిన్నారెడ్డి**



వనపర్తి, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తనను తప్పించబడటంపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి చిన్నారెడ్డి మండిపడ్డారు. ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన నాటి నుంచి తాము ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నామని, క్రమశిక్షణతో కష్టపడి ఈ స్థాయికి వచ్చిన తనను ‘ఒక్క పోటుతో కూల్చేశారని’ ఆవేదన వ్యక్తం చేశారు. పదవి నుంచి తొలగించిన అనంతరం వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని తన సొంతూరు జయన్న తిరుమలాపురంలోని వ్యవసాయ క్షేత్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం పార్టీలో తలెత్తిన ఈ సమస్యలకు, తనపై జరిగిన చర్యలకు ఎంపీ, పీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవి మాత్రమే ప్రధాన కారణమని చిన్నారెడ్డి నేరుగా ఆరోపించారు. స్థానిక పరిణామాల నేపథ్యంలో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఫిర్యాదు ఆధారంగా మల్లు రవి ఏకపక్షంగా వ్యవహరించారని మండిపడ్డారు. మాజీ మంత్రి కొండా సురేఖ ఆమె బర్తరఫ్ వేళ అధిష్ఠానంతో మాట్లాడేందుకు ఢిల్లీకి వెళ్లినా ఫలితం దక్కలేదని... అందుకే తన పరిస్థితి కూడా అలాగే మారుతుందనే ఉద్దేశంతో తాను ఢిల్లీకి కానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు కానీ వెళ్లేందుకు ప్రయత్నించలేదని స్పష్టం చేశారు. పార్టీలో వి.హనుమంతరావు తర్వాత అత్యంత సీనియర్ నాయకుడిని తానేనని చిన్నారెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 42 మంది ఎమ్మెల్యేలతో వనపర్తిలో భారీ బహిరంగ సభ నిర్వహించి, సంతకాల సేకరణతో ఉద్యమానికి ఊపిరి పోసిన చరిత్ర తనదని పేర్కొన్నారు. తనకు పదవి ఇచ్చేటప్పుడే ఉత్తర్వుల్లో ఎలాంటి నిర్దిష్ట కాలపరిమితి విధింపు లేకుండా ‘తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు’ మాత్రమే అని ఇచ్చారని, పైగా కేబినెట్ హోదా ఉన్నప్పుడే తాను ప్రోటోకాల్ సదుపాయాలను వదులుకున్నానని చెప్పారు. తన కుమారుడికి పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రిని ఎప్పుడూ కోరలేదని, పదవి ఉన్నా లేకున్నా తన వ్యక్తిగత గౌరవం తనకు ఉంటుందని, భవిష్యత్తు కార్యాచరణపై కార్యకర్తలతో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని వెల్లడించారు.

## రేవంత్‌కు కొండా సురేఖ శాఖలు

**జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన నేపథ్యంలో దేవదాయ, అటవీ, పర్యావరణ శాఖల బాధ్యతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వీకరించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేస్తూ జీవో నంబర్ 128తో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. తదుపరి మంత్రివర్గ విస్తరణ లేదా శాఖల పునర్విభజన జరిగే వరకు ఆయా శాఖల పర్యవేక్షణ బాధ్యతలు సీఎం రేవంత్ వద్దే ఉండనున్నాయి. సురేఖ బర్తరఫ్‌తో తెలంగాణ రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. కేబినెట్‌లో ఇప్పటికే ఖాళీగా ఉన్న స్థానాలతో పాటు ఇప్పుడు సురేఖ ప్రాతినిధ్యం వహించిన స్థానం కూడా ఖాళీ అవ్వడంతో మొత్తం మూడు మంత్రి పదవులు అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం త్వరలోనే కేబినెట్ విస్తరణ, ప్రక్షాళనపై దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కొండా సురేఖ స్థానంలో సామాజిక న్యాయం, ప్రాంతీయ సమతుల్యత దెబ్బతినకుండా ఉండేందుకు బీసీ, మహిళా కోటాలను ప్రాతిపదికగా తీసుకుని కొత్త ముఖాలకు అవకాశం కల్పించేందుకు ఏఐసీసీ వ్యూహాలు రచిస్తోంది.

## ట్రాన్స్‌ఫార్మర్లకు ఎర్తింగ్

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ సెక్షన్ పరిధిలోని హన్మాజీపేట, బొల్లారం గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఎర్తింగ్ వ్యవస్థను పునరుద్ధరిస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ ప్రమాదాల నివారణతోపాటు పరికరాల భద్రతను మెరుగుపరిచేందుకు ఈ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దెబ్బతిన్న ఎర్తింగ్‌లను మరమ్మతు చేయడంతోపాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త ఎర్తింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సెక్షన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి వినియోగదారులకు సురక్షితమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఏఈ ప్రవంతి, లైన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, లైన్‌మెన్ వెంకటేశ్వర్లు, హెల్పర్ దేవరాజం తదితరులు పాల్గొన్నారు.



## ఇస్కాన్ ఆలయంలో బీజేపీ నేతల పూజలు

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని ఆరేపల్లిలోని ఇస్కాన్ ఆలయంలో బీజేపీ సీనియర్ నాయకుడు ప్రతాప రామకృష్ణ, వేములవాడ పట్టణ బీజేపీ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. వేములవాడ నియోజకవర్గ ప్రజలకు జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుమ్మరి శంకర్, రేగుల మల్లికార్జున్, మండల నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



## రాజన్న ఆలయంలో ఫైర్ మాక్‌డ్రిల్

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. భీమేశ్వర స్వామి వసతి గృహం వద్ద డీఈ రామ్‌కిషన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, హోంగార్డులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది, నిత్యాన్నదాన సత్రం, లడ్డూ తయారీ కేంద్రం ఉద్యోగులు పాల్గొన్నారు. గ్యాస్ లీకేజీ, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను అధికారులు ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు. తడి వస్త్రాలు, కార్బన్ డయాక్సైడ్ సిలిండర్లతో మంటలను అదుపు చేసే విధానాన్ని చూపించారు. ప్రమాద సమయంలో భక్తులను ఆందోళనకు గురికాకుండా సురక్షితంగా బయటకు తరలించాలని, వెంటనే విద్యుత్, గ్యాస్ సరఫరాలను నిలిపివేయాలని సూచించారు. అగ్నిమాపక పరికరాలను 'పాస్' పద్ధతిలో వినియోగించే విధానాన్ని వివరించారు. దట్టమైన పొగ వ్యాపించినప్పుడు తడి గుడ్డను అడ్డుగా పెట్టుకుని నేలపై పాకుతూ బయటకు రావాలని సూచించారు. అత్యవసర సమయంలో 101 లేదా 112కు సమాచారం అందించాలని పీఆర్వో పెరక శ్రీనివాస్ తెలిపారు.



## మహాలక్ష్మి ఆలయంలో విశేష పూజలు

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. బ్రాహ్మీముహూర్తంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారికి మంగళస్నానం, అభ్యంగన స్నానం, మహాభిషేకం నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి లోకకల్యాణం, ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను కాంక్షిస్తూ ప్రత్యేక హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం సువాసినులతో సామూహిక లక్ష్మీ సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. ఓ మహిళా భక్తురాలు 108 కమలాలను సమర్పించగా అష్టోత్తర శతనామాలతో ప్రత్యేక అర్చన జరిపారు. సాయంత్రం 4 గంటలకు శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం నుంచి అర్చకులు, వేదపండితులు మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా మహాలక్ష్మి ఆలయానికి చేరుకుని షోడశోపచార పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా అమ్మవారికి నిత్యం ఉదయం, సాయంత్రం 64 ఉపచారాలతో విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. సూర్యాస్తమయ వేళ నిర్వహించిన 'ఛాయాసక్త పూజ'కు విశేష ప్రాధాన్యం ఉందని పండితులు తెలిపారు. ఈ పూజలో పాల్గొంటే దారిద్ర్య బాధలు తొలగి ఆర్థికాభివృద్ధి, సంతాన సౌభాగ్యం, వంశాభివృద్ధి కలుగుతాయని పేర్కొన్నారు. మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని చీర, సారె, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఏఈవో జయకుమారి, పర్యవేక్షకులు పూజిత, వెంకటలక్ష్మి, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## టీ-సేవ కేంద్రాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 'టీ-సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రాల' ఏర్పాటుకు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. పంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా, నగర స్థాయిల్లో కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కేంద్రాల ద్వారా పాన్‌కార్డు జారీ, సవరణలు, మనీ ట్రాన్స్‌ఫర్, ఆధార్ ఆధారిత నగదు చెల్లింపులు, మైక్రో ఏటీఎం, నగదు డిపాజిట్లు, బ్యాంకు ఖాతాల ప్రారంభం వంటి ఆన్‌లైన్, బ్యాంకింగ్ సేవలు అందించవచ్చని తెలిపారు. బస్సు, రైలు, విమాన టికెట్ల బుకింగ్, విద్యుత్ తదితర బిల్లుల చెల్లింపులు, కొరియర్ సేవలు కూడా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఆరోగ్య, ద్విచక్ర, కార్ల బీమా పాలసీలు, వ్యక్తిగత రుణాలు, డిజిటల్ బంగారం కొనుగోలు వంటి ఆర్థిక సేవలు కూడా అందించవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన 100కు పైగా నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ, నైపుణ్య పరీక్షల ధ్రువీకరణ నమోదు, 100కు పైగా ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు మాక్ టెస్ట్ రిజిస్ట్రేషన్ సదుపాయం ఉంటుందని తెలిపారు. విస్తృత ఆన్‌లైన్ సేవలు అందించడం ద్వారా యువత స్వయం ఉపాధి పొందవచ్చని సూచించారు. వివరాలకు 8179955744 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



# ఉపాధ్యాయులే భవిష్యత్ నిర్మాణకర్తలు

### సంస్కృతి స్కూల్స్‌లో టీచర్స్ డే వేడుకల్లో కొండా విశ్వేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం, కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచానికి భగవద్గీత ద్వారా అమూల్యమైన జ్ఞానాన్ని అందించిన శ్రీకృష్ణుడు తొలి గురువుగా నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత, మానవతా దృక్పథాన్ని నేర్పించాలని సూచించారు. సగటు విద్యార్థిగా కనిపించే వ్యక్తి కూడా భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి ఎదగగలడని తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై నమ్మకం ఉంచి సరైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందిస్తే వారి ప్రతిభ వెలుగులోకి వస్తుందని చెప్పారు. మంచి ఉపాధ్యాయుడు విద్యార్థిలో ఆశను నింపి, ఊహాశక్తిని రగిలించి, నేర్చుకోవాలనే ఆసక్తిని పెంచుతారని అన్నారు. సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ మంగళారపు లక్ష్మణ్ మాట్లాడుతూ రాబోయే తరానికి మంచి ఉపాధ్యాయుల కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. నేటితరం యువత అధిక ఆదాయం కోసం పోటీ పరీక్షలు, ప్రభుత్వ, ప్రైవేటు, సాఫ్ట్‌వేర్ రంగాల వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలోకి యువతను ఆకర్షించాల్సిన అవసరం ఉందన్నారు. డైరెక్టర్ భవాని, రాహుల్, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, సౌజన్య, వినోదిని, శివాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఉస్మానియా వర్సిటీలో కృష్ణాష్టమి సందడి

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కాలేజీ ఎదుట విద్యార్థుల ఆధ్వర్యంలో, కడారి రమేష్ యాదవ్ అధ్యక్షతన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు 500 మందికి పైగా విద్యార్థులు, భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు బోధించిన ధర్మం, న్యాయం, కర్తవ్యనిష్ఠ, సమానత్వం, మానవతా విలువలను యువతలో పెంపొందించడమే వేడుకల ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథులుగా యాదవ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్, వట్టే జానయ్య యాదవ్, చిరంజీవి సార్ (బీసీఐఎఫ్), గుజ్జ సత్యం, సీఐ ఏడుకొండలు, టీపీసీసీ అధికార ప్రతినిధి కోటూరి మనవతరాయ్, డాక్టర్ శివ ముదిరాజ్, బీసీ విద్యార్థి నాయకులు సైదులు యాదవ్, చీమల జగదీష్ యాదవ్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, నీరజగౌడ్, నరేందర్ నేత తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, పరిశోధకులు, పూర్వ విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# ఘనంగా ఎల్.రమణ జన్మదిన వేడుకలు

జగిత్యాల, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): శాసనమండలి బీఆర్ఎస్ ఉపనేత, ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్.రమణ 65వ జన్మదిన వేడుకలను శుక్రవారం జగిత్యాలలో ఘనంగా నిర్వహించారు. పట్టణ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల యూనియన్ ప్రెసిడెంట్ స్థాయి నుంచి మంత్రి వరకు ఎదిగి ప్రజాసేవలో తనదైన ముద్ర వేశారని నాయకులు కొనియాడారు. అనంతరం శ్రీభక్త మార్కండేయ ఆలయంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఎల్.రమణ పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. 7వ వార్డు కౌన్సిలర్ కోరుకంటి రాము ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించగా బీఆర్ఎస్ యువజన నాయకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దయ్యాల మల్లారెడ్డి, నాయకులు పులి మల్లేశంగౌడ్, పద్మశాలి సంఘ బాధ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం:

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ అన్నారు. బీర్‌పూర్ గ్రామపంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, మైక్ సెట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే చిన్నచిన్న ఘటనలను ముందుగానే గుర్తించి నివారించేందుకు సీసీ కెమెరాలు దోహదపడతాయన్నారు. పంచాయతీ కార్యాలయం, ప్రధాన కూడళ్ల వద్ద కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుందని, శాంతిభద్రతలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రభుత్వ సంస్థలతో పాటు గ్రామస్థులు కూడా తమ ఇళ్ల ముందు, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల గ్రామానికి పటిష్ఠమైన భద్రతా వలయం ఏర్పడుతుందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హరీష్, ఉపసర్పంచ్ జితేందర్, పీఏసీఎస్ చైర్మన్ నవీన్‌రావు, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, మండల నాయకులు మహిపాల్‌రెడ్డి, నారపాక రమేష్, సర్పంచులు మారుతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## నలుగురు ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు

ఎండపల్లి, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): 2026-27 విద్యా సంవత్సరానికి జగిత్యాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎండపల్లి మండలం నుంచి నలుగురు ఎంపికయ్యారు. జెడ్పీహెచ్ఎస్ గోడిసెలపేటకు చెందిన జీహెచ్ఎం కె. జయ, ఎంపీపీఎస్ ఎండపల్లికి చెందిన నాగం రమేశ్, ఎంపీపీఎస్ ఉండేడకు చెందిన జోగం శ్రీనివాస్, ఎంపీపీఎస్ గుల్లకోటకు చెందిన ఆర్. మాలతి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. విద్యార్థుల అభ్యసనాభివృద్ధి, నాణ్యమైన బోధనతోపాటు పాఠశాలల అభివృద్ధికి చేసిన సేవలను గుర్తించి వీరికి ఈ అవార్డులు దక్కాయి. ఈ సందర్భంగా మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ ఉపాధ్యాయులను అభినందించారు.

## కృష్ణుడి వేషధారణలో విద్యార్థులు

జగిత్యాల, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): జగిత్యాల వాణీనగర్‌లోని శాతవాహన యూపీఎస్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




## హామీలు అనేకం.. అమలు శూన్యం: సుంకె రవిశంకర్

బోయినపల్లి, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బోయినిపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ, రోడ్డుపై బైఠాయింపు, వంటావార్పు కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, చొప్పదండి నియోజకవర్గ బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి పన్యాల భూపతిరెడ్డి, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బస్టాండ్ కూడలి వద్ద రోడ్డుపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, స్కూటీలు ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. గత 1000 రోజులుగా రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ప్రభుత్వం ద్రోహం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా 1000 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా సంబరాలు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల సాధన కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పల్లె దవాఖాన స్థలంలో ఇసుక చోరీ

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): సిరిసిల్ల జిల్లా హన్మాజీపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న పల్లె దవాఖాన ఆవరణలో నిల్వ ఉంచిన ఇసుక చోరీకి గురైంది. ఈ ఘటనపై కాంట్రాక్టర్ వంగపల్లి మల్లేశం వేములవాడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2023 డిసెంబర్‌లో తహసీల్దార్ అనుమతితో భవన నిర్మాణం కోసం రైతు వేదిక ప్రాంగణంలో సుమారు 30 ట్రిప్పుల ఇసుకను నిల్వ చేసినట్లు కాంట్రాక్టర్ తెలిపారు. భవన నిర్మాణం స్లాబ్ స్థాయికి చేరుకున్న అనంతరం సాంకేతిక కారణాలతో పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. దీంతో ఇసుక, కంకర, ఇటుకలు అక్కడే నిల్వ ఉన్నాయి. ఆగస్టు 30న రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 1 గంట మధ్య కొందరు వ్యక్తులు ట్రాక్టర్లతో వచ్చి సుమారు ఎనిమిది ట్రిప్పుల ఇసుకను తరలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తొలుత వార్డు సభ్యుడు పెద్దపల్లి మనోజ్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన ఆదేశాలతో ఆర్ఐ బాలు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రాథమిక విచారణ చేపట్టారు. అనంతరం కాంట్రాక్టర్ పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భవన నిర్మాణానికి కేటాయించిన ఇసుకను చోరీ చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కృష్ణాష్టమి వేడుకల్లో వెంకటేశ్ గౌడ్

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): కూకట్‌పల్లి కమలప్రసన్ననగర్ కాలనీలోని ఇస్కాన్ ఆలయంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులతో కలిసి హరే రామ హరే కృష్ణ సంకీర్తనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరిపై శ్రీకృష్ణుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షిస్తూ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలను ఘనంగా నిర్వహించిన ఆలయ నిర్వాహకులను అభినందించారు. సమ్మారెడ్డి, పోశెట్టిగౌడ్, నాగేష్‌గౌడ్‌తోపాటు భక్తులు పాల్గొన్నారు.

## అవంతి కళాశాలలో కృష్ణాష్టమి వేడుకలు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): బర్కత్‌పురలోని అవంతి డిగ్రీ, పీజీ కళాశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విద్యార్థులు, అధ్యాపకులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణాన్ని సంప్రదాయబద్ధంగా అలంకరించగా విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై యువతలో గౌరవాన్ని, విద్యార్థుల్లో ఐక్యతా భావాన్ని పెంపొందించేందుకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. వేడుకల్లో భాగంగా దహీహండి, కుండల అలంకరణ, శ్రీకృష్ణుడి విశేషాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు కళాశాల యాజమాన్యం ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేసింది. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అధ్యాపకులు, విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేణుగోపాల్ అభినందించారు.



## 84 కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ సాయం

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 84 మంది బాధిత కుటుంబాలకు రూ.53,24,150 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి ఆయన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్స పొందలేని నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు. వైద్య చికిత్సకు ఆర్థిక సాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత్‌రావు, ఉరిటి వెంకట్రావు, డీఎస్ఆర్కే ప్రసాద్, ఎండీ ఇబ్రహీం, జిల్లా గణేష్, మారెళ్ల శ్రీనివాస్, చంద్రమోహన్ సాగర్, అష్రఫ్, భాషా తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం: ఎమ్మెల్యే సంజయ్

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 1000 రోజులు గడిచినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో భారీ ధర్నా, వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికలకు ముందు చెప్పిన మాటలకు, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం చేస్తున్న పనులకు ఎలాంటి పొంతన లేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలు ఏమైందని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు బీఆర్ఎస్ నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ తీరును నిరసిస్తూ ధర్నా, వంటావార్పు కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు.



## శ్రీరామ తారక భజన బృందానికి గుర్తింపు కార్డులు

ఏపీలోని శ్రీకాకుళం జిల్లా బాతువ గ్రామానికి చెందిన శ్రీరామ తారక భజన బృందం సభ్యులకు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. మండల కళాకారుల సంఘం ప్రతినిధి ముళ్లపూడి రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ పెద్దలు ఎంపీటీసీ బూటు అప్పారావు, మాజీ సర్పంచ్‌లు డబ్బాడ ఆదినారాయణ, పల్లేడ సన్యాసిరావు, టీడీపీ సీనియర్ నాయకులు కూనుబిల్లి కూర్మారావు, మీసాల అప్పలనాయుడు భజన బృందం సభ్యులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భజన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు చేస్తున్న కృషిని అభినందించారు. మరింత విస్తృతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని, అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. బృందం గురువు మజ్జి లక్ష్మునాయుడు, సభ్యులు బూటు జగదీశ్వరరావు, మల్లు రామినాయుడు, త్రినాథరావు, ముల్లు అప్పలనాయుడు, ముల్లు అప్పారావు, బూటు వెంకటరావు, బూటు అనంతరావు, ముల్లు త్రినాథరావు, ముల్లు రమణ, ముల్లు సింహాచలం, కెల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.



## కొండగట్టులో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

మల్యాల, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలగోపాలస్వామివారికి పంచామృతాభిషేకం, సహస్రనామ తులసి అర్చన నిర్వహించారు. అనంతరం ఉయ్యాల సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ అంజనారెడ్డి, స్థానాచార్య కపిందర్, చిరంజీవి స్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్ అశోక్, భక్తులు పాల్గొన్నారు.

## కొండగట్టులో కొత్త మొబైల్ టవర్

మల్యాల, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఇండస్ టవర్స్ సంస్థ ఏర్పాటు చేసిన నూతన మొబైల్ టవర్‌ను చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ప్రారంభించారు. టవర్ అందుబాటులోకి రావడంతో దేవస్థానానికి వచ్చే భక్తులతోపాటు స్థానిక ప్రజలకు మెరుగైన మొబైల్ నెట్‌వర్క్, కమ్యూనికేషన్ సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ అంజనారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): హైదరాబాద్ నగర తొలి మేయర్, పత్రికా సంపాదకుడు, సంఘ సంస్కర్త కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 133వ జయంతి వేడుకలు సికింద్రాబాద్ న్యూ బోయిగూడలోని ముదిరాజ్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు జి. దివాకర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు వి. హనుమంతరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణస్వామి ముదిరాజ్ జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలను విడుదల చేశారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృష్ణస్వామి ముదిరాజ్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన జీవితం అందరికీ ఆదర్శమని అతిథులు పేర్కొన్నారు. ఇటీవల నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఎన్నికైన ఉమారాణి, సంగారెడ్డి జిల్లా సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అంజమ్మలను సన్మానించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారులు దినకర్‌బాబు, జగన్మోహన్, ముదిరాజ్ మహాసభ నాయకులు కృష్ణమూర్తి, మన్మోహన్, చెన్నయ్య, శారద, సురేందర్ వెంకట్రావు, మంద శ్రీనివాస్, ఆంజనేయులు, నీలం శ్రీనివాస్, ప్రకాష్, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో కృష్ణాష్టమి పూజలు

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సికింద్రాబాద్ బోయిగూడలోని సాయిబాబా దేవాలయం వద్ద శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు మంచాల గోపి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు మర్రి పురూరవ రెడ్డి, టి. రాజశేఖరరెడ్డి, సత్యనారాయణ, చంద్రపాల్‌రెడ్డి, గణేష్, అంజిరెడ్డి, వికాస్, శ్రీనివాస్, నర్సింగ్‌యాదవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణస్వామి ముదిరాజ్‌కు ఘన నివాళి

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బన్సీలాల్‌పేట్ చౌరస్తాలో కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 133వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ హాజరై కృష్ణస్వామి ముదిరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృష్ణస్వామి ముదిరాజ్ జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. నాయకులు డాకి అశోక్ ముదిరాజ్, వై. శ్రీనివాస్ ముదిరాజ్, చక్రం ప్రభాస్, వై. సురేష్‌కుమార్, డి. శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ తీసుకొని విమానం నడిపాడు!

### పైలట్‌పై ఎయిరిండియా వేటు

న్యూఢిల్లీ: విమాన ప్రయాణికుల భద్రతను ప్రమాదంలోకి నెట్టిన ఓ పైలట్‌పై ఎయిర్ ఇండియా కఠిన చర్యలు తీసుకుంది. మాదకద్రవ్యాల (సైకోయాక్టివ్ సబ్‌స్టాన్స్) పరీక్షలో పాజిటివ్‌గా తేలడంతో పైలట్-ఇన్-కమాండ్ (పీఐసీ)ని తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించినట్లు శుక్రవారం ప్రకటించింది. ఫుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న విమానంలో తీవ్రమైన ఘటన చోటుచేసుకున్న అనంతరం నిర్వహించిన పరీక్షల్లో ఈ విషయం బయటపడింది. భద్రతా నిబంధనల ఉల్లంఘన విషయంలో తమది "జీరో-టాలరెన్స్" విధానమని ఎయిర్ ఇండియా ప్రతినిధి స్పష్టం చేశారు. "ఫుకెట్-ఢిల్లీ విమాన పైలట్ మాదకద్రవ్యాల పరీక్షలో పాజిటివ్‌గా తేలారు. భద్రత, ఫిట్‌నెస్ లేదా ఇతర నియంత్రణ నిబంధనల ఉల్లంఘనను ఏమాత్రం సహించబోము.

# ఈ ఏడాదే గగన్‌యాన్ తొలి ప్రయోగం

### ఇస్రో చైర్మన్ నారాయణన్

బెంగళూరు: భారతదేశపు ప్రతిష్ఠాత్మక మానవ అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్' దిశగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) కీలక ముందడుగు వేస్తోంది. గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా చేపట్టే తొలి మానవ రహిత ప్రయోగానికి సంబంధించిన పనులు పూర్తి స్థాయిలో జరుగుతున్నాయని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ వెల్లడించారు. ఈ యాత్రను ఈ ఏడాది చివరి నాటికి నిర్వహించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మొదటి మానవ రహిత యాత్రను నాలుగో త్రైమాసికంలో ప్రయోగించాలని ఇస్రో భావిస్తోంది. ఈ యాత్రలో 'వ్యోమమిత్ర' అనే హాఫ్-హ్యూమనాయిడ్ రోబోను అంతరిక్షంలోకి పంపనున్నారు. వ్యోమగాములు ప్రయాణించేటప్పుడు క్యాబిన్‌లోని పరిస్థితులను, వారి శరీర కదలికలను ఇది అనుకరిస్తుంది. మానవులను అంతరిక్షంలోకి పంపే ముందు, భద్రతా ప్రమాణాలను నిర్ధారించుకునేందుకు మొత్తం మూడు మానవ రహిత ప్రయోగాలు నిర్వహించాలని ఇస్రో ప్రణాళిక వేసింది. గగన్‌యాన్ మిషన్ కోసం కీలకమైన సాంకేతిక అభివృద్ధి దాదాపు పూర్తి కావచ్చిందని ఇస్రో వర్గాలు వెల్లడించాయి. ప్రయోగానికి ఉపయోగించే లాంచ్ వెహికల్ (హెచ్‌ఎల్‌వీఎం 3)కు హ్యూమన్-రేటింగ్ ప్రక్రియ పూర్తయింది. వ్యోమగాముల భద్రతకు సంబంధించిన క్రూ ఎస్కేప్ సిస్టమ్, లైఫ్ సపోర్ట్ సిస్టమ్స్ అభివృద్ధి కూడా పూర్తయ్యాయి. క్రూ మాడ్యూల్, సర్వీస్ మాడ్యూల్ అసెంబ్లీ, టెస్టింగ్ తుది దశకు చేరుకున్నాయి. ఇప్పటివరకు దాదాపు 8,000 పరీక్షలు పూర్తి చేసినట్లు ఇస్రో తెలిపింది. ముగ్గురు భారతీయ వ్యోమగాములను భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి పంపి, అక్కడ మూడు రోజుల పాటు ఉంచి, సురక్షితంగా భూమికి తీసుకురావడం గగన్‌యాన్ మిషన్ లక్ష్యం . ఈ ప్రయోగాన్ని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి చేపట్టనున్నారు. ఇప్పటికే వ్యోమగాములు రష్యాలో జనరిక్ శిక్షణ పూర్తి చేసుకోగా, బెంగళూరులోని ఆస్ట్రోనాట్ ట్రైనింగ్ ఫెసిలిటీలో మిషన్-స్పెసిఫిక్ శిక్షణ పొందుతున్నారు. ఈ మిషన్ అత్యంత సాంకేతికతతో కూడుకున్నదని, వ్యోమగాముల భద్రతకే తాము అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని డాక్టర్ నారాయణన్ స్పష్టం చేశారు. ప్రతి వ్యవస్థను 100 శాతం సమీక్షించి, ధ్రువీకరించుకున్న తర్వాతే తుది ప్రయోగ తేదీలను ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ఈ కారణంగానే ప్రయోగ తేదీలలో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉందని సూచనప్రాయంగా వెల్లడించారు.




## 2027 వరకు పశ్చిమాసియాలోనే అమెరికా బలగాలు

వాషింగ్టన్: పశ్చిమాసియాలో ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతంలో మోహరించిన తమ సైనిక బలగాల గడువును 2027 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు యుద్ధ విషయంలో మరిన్ని ప్రత్యామ్నాయాలు ఇచ్చేందుకు ఉద్దేశించిన దీర్ఘకాలిక సైనిక వ్యూహంలో భాగమని 'వాల్ స్ట్రీట్ జర్నల్' తన కథనంలో వెల్లడించింది. ఇరాన్‌పై సైనిక చర్యలు, ఆర్థిక ఒత్తిడి, అవసరమైతే విస్తృత స్థాయి యుద్ధం వంటి అంశాలను ట్రంప్ పరిశీలనలో ఉంచడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొదట ఇరాన్‌పై స్వల్పకాలిక, నిర్ణయాత్మక సైనిక చర్యగా ప్రచారం చేసినప్పటికీ, ఇప్పుడు ఈ మోహరింపు భారీగా విస్తరించింది. ప్రస్తుతం పశ్చిమాసియాలో సుమారు 50,000 మంది అమెరికా సైనికులు, 19 యుద్ధ నౌకలు, ఫైటర్ స్క్వాడ్రన్లు, వాయు రక్షణ విభాగాలు, పారాట్రూపర్లు మోహరించి ఉన్నారు. ఈ సుదీర్ఘ మోహరింపు కారణంగా అమెరికా సైనికులు, వారి కుటుంబాలు, సైనిక పరికరాలపై తీవ్ర భారం పడుతోందని 'వాల్ స్ట్రీట్ జర్నల్' పేర్కొంది. ఆర్మీ ఎయిర్ డిఫెండర్ల సేవా కాలాన్ని 9 నెలల నుంచి 12 నెలలకు పెంచారు. యూరప్, పసిఫిక్ ప్రాంతాల నుంచి వచ్చిన కొన్ని యూనిట్లు ఏడాదికి పైగా అక్కడే విధులు నిర్వర్తిస్తున్నాయి. నౌకాదళం కూడా ఇదే విధమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ప్రస్తుతం రెండు విమానవాహక నౌకలు, 13 గైడెడ్-మిసైల్ డిస్ట్రాయర్‌లతో సహా మొత్తం 19 యుద్ధ నౌకలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. యుద్ధం ప్రారంభంలో పంపిన యూఎస్ఎస్ డెల్బర్ట్ డి. బ్లాక్, యూఎస్ఎస్ ట్రూయన్స్ వంటి నౌకలు, వాటిలోని 300 మంది సిబ్బంది నెలల తరబడి విరామం లేకుండా సముద్రంలోనే గడుపుతున్నారు. అదే సమయంలో ట్రంప్ యంత్రాంగం ఇరాన్‌పై తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి ప్రయోగించడం ద్వారా ఆ దేశ నాయకత్వాన్ని తిరిగి చర్చల టేబుల్‌పైకి తీసుకురావాలని వ్యూహరచన చేస్తోంది. ఆర్థిక ఒత్తిడితోనే ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని నిలిపివేస్తుందని, అందుకే ఈ యుద్ధాన్ని ముగిసినట్లుగా ప్రకటించడంపై ట్రంప్ తన సీనియర్ సహాయకులతో చర్చిస్తున్నట్లు సమాచారం.

## త్వరలో రెపో రేటు పెంపు?

### ఏప్రిల్ 2027 నాటికి 6 శాతానికి పెంచే అవకాశం



న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న సంక్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపో రేటును ఏప్రిల్ 2027 నాటికి 6 శాతానికి పెంచే అవకాశం ఉందని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ బంధన్ ఏఎంసీ తన నివేదికలో అంచనా వేసింది. మార్కెట్లలో పేరుకుపోయిన అదనపు నగదు లభ్యత (లిక్విడిటీ), పెరుగుతున్న ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నేపథ్యంలో స్థిరమైన ద్రవ్య విధానాన్ని రూపొందించేందుకు ఈ పెంపు అవసరమని నివేదిక శుక్రవారం స్పష్టం చేసింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఒకవైపు, విదేశీ పెట్టుబడుల రూపంలో భారీగా వస్తున్న రూపాయి నిధుల వల్ల ఏర్పడిన అదనపు లిక్విడిటీ మరోవైపు.. ఈ రెండింటి మధ్య భారత ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఇన్వెస్టర్లు సంక్లిష్టమైన వాతావరణాన్ని ఎదుర్కొంటున్నారని నివేదిక విశ్లేషించింది. ఈ అదనపు నగదు ప్రవాహం కారణంగా ఓవర్‌నైట్ వడ్డీ రేట్లు, ఆర్బీఐ పాలసీ రేటు కంటే చాలా తక్కువ స్థాయికి పడిపోయాయని తెలిపింది. ఈ అసమతుల్యతను సరిదిద్దడానికి ఆర్బీఐ త్వరలోనే రంగంలోకి దిగాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి ఆర్బీఐ ఎంత వేగంగా చర్యలు తీసుకుంటుందన్న దానిపైనే భవిష్యత్తు ఆధారపడి ఉందని నివేదిక అభిప్రాయపడింది. ఓవర్‌నైట్ రేట్లను తిరిగి పాలసీ రేట్లతో అనుసంధానించడం, మధ్యకాలికంగా ఉన్న అదనపు లిక్విడిటీని తగ్గించడం, ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని రెపో రేటు పెంపుపై ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) నిర్ణయం తీసుకోవడం వంటి చర్యలు ఉంటాయని అంచనా వేసింది. ఎఫ్ఎక్స్ స్వాప్స్, ఎంఎస్ఎస్ బాండ్లు, ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ (ఓఎంఓ) అమ్మకాలు, అవసరమైతే నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్) పెంపు వంటి చర్యలను మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయని తెలిపింది. మధ్యప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో ఇంధన ధరలు పెరగడం, వ్యవసాయ ఉత్పత్తులతో సహా ఇతర కమొడిటీల ధరల్లో ఒత్తిడి వంటి అంతర్జాతీయ అంశాలు ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తున్నాయని నివేదిక గుర్తు చేసింది. దీనికి తోడు, దేశంలో రుతుపవనాలు అస్తవ్యస్తంగా ఉండటం, జీడీపీ వృద్ధి బలంగా నమోదు కావడం, రుణ వృద్ధి సుమారు 18 శాతంగా ఉండటం వంటి స్థానిక పరిస్థితులు కూడా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను పెంచుతున్నాయని వివరించింది. ఇప్పటివరకు వెలువడిన గణాంకాలు ఆర్బీఐకి కొంత ఊరటనిచ్చినప్పటికీ, ఇటీవలి ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశపు మినిట్స్.. సభ్యుల వైఖరి కఠినంగా మారుతోందనడానికి సంకేతమని నివేదిక అభిప్రాయపడింది. ప్రపంచవ్యాప్తంగా ధరల ఒత్తిళ్లు మరింత తీవ్రమవుతున్న తరుణంలో, ప్రస్తుత పాలసీ వైఖరిపై ఎంపీసీ సభ్యులలో అసౌకర్యం పెరుగుతోందని అంచనా వేసింది.

## అక్రమంగా పశువుల తరలింపు.. 11 మంది అరెస్ట్

ఎండపల్లి, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): అక్రమంగా పశువులను తరలిస్తున్న ఐదు వాహనాలను రామగుండం పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్, నార్కోటిక్ టీమ్ అడ్డుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి మార్కెట్‌కు పశువులను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో మందమర్రి టోల్‌ప్లాజా, తాళ్లగురిజాల వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మూడు వాహనాల్లో 30 పశువులు, మరో రెండు వాహనాల్లో 27 పశువులు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 57 పశువులతో పాటు ఐదు మహీంద్రా క్యాంపర్ వాహనాలు, ఆరు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పశువులను తరలిస్తున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిని నక్క రాజ్‌కుమార్, షేక్ అహ్మద్, సుంకె కుమార్, షేక్ షఫీ, షేక్ షాహీద్, ఒరగంటి రాజ్‌కుమార్, తాండ్ర శ్రీనివాస్, ఎస్‌కే అయూబ్, ఎస్‌కే ఇర్ఫాన్, సయ్యద్ ఇర్ఫాన్, సయ్యద్ ఫర్హాన్‌గా గుర్తించారు. వీరంతా గొల్లపల్లి మండలం చిల్వకోడూర్ గ్రామానికి చెందినవారిగా పోలీసులు తెలిపారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్‌రావు నేతృత్వంలో ఈ తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన వారిని, వాహనాలు, పశువులను సంబంధిత పోలీస్‌స్టేషన్లకు అప్పగించి కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## వేణుగోపాల స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 4 (ఈవార్తలు): కృష్ణాష్టమిని పురస్కరించుకుని భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు ఆధ్వర్యంలో స్థానిక వేణుగోపాల స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కినపల్లి కాశీనాథం, చిట్ల గంగాధర్ మాట్లాడుతూ దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మసంస్థాపన కోసం శ్రీమహావిష్ణువు శ్రీకృష్ణుడిగా అవతరించిన పర్వదినమే జన్మాష్టమి అని తెలిపారు. భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు ప్రపంచ మానవాళికి ధర్మబద్ధమైన జీవన మార్గాన్ని చూపించారని పేర్కొన్నారు. కష్టాలు, ఆపదలకు భయపడకుండా ధర్మం కోసం నిలబడాలని ఆయన బోధించారని అన్నారు. నిర్మలమైన మనసుతో భక్తిని కలిగి ఉన్న ప్రతి హృదయంలో శ్రీకృష్ణుడి చైతన్యం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, బాశెట్టి విజయలక్ష్మి, సింగం గంగాధర్, కొత్తకొండ బాలన్న, గాదాసు భూమన్న, చిలుక రాజన్న, సిరిపురం గంగారం, ఆర్ఎస్ఎస్ వీరన్న, ఎడమల వెంకట్‌రెడ్డి, వేముల దేవరాజం, ఆడెపు జానయ్య, కె.ఆర్. కృష్ణ, గంద్ర ప్రవీణ్‌రావు, నాయిని సంజీవరావు, నరేందుల శ్రీనివాస్, బాశెట్టి ప్రభాకర్, గొల్లపల్లి సత్యనారాయణగౌడ్, బొందుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




లష్కరి చిత్రం




# రాధ గెటప్‌లో అనసూయ!



ఇటీవల పలు కామెంట్స్ తో వార్తల్లో నిలిచిన యాక్ట్రెస్ అనసూయ.. ఇప్పుడు కృష్ణుడి సాంగ్ తో అందరి దృష్టిని ఆకర్షించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా షేర్ చేసిన ఓ డ్యాన్స్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అయితే వీడియోలో ఆమె డ్యాన్స్ ఎంతగా ఆకట్టుకుందో.. చివర్లో పెట్టిన క్యాప్షన్ అంతకంటే ఎక్కువ చర్చకు దారితీస్తోంది. దీంతో సనాతన ధర్మంపై ఇటీవల తనపై వచ్చిన విమర్శలకు అనసూయ ఇలా ఫుల్ స్టాప్ పెట్టారా? అనే ప్రశ్న వినిపిస్తోంది. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా అనసూయ రాధా గెటప్ లో కనిపించారు. ఎరుపు రంగు చీరలో, స్పెషల్ మేకప్ తో ఆమె చేసిన డ్యాన్స్ ఆకట్టుకుంది. ఇన్ స్టాగ్రామ్ లో వైరల్ గా మారిన 'తులసి కోమలవేణి.. అనే కన్నడ సాంగ్ కు ఆమె డ్యాన్స్ చేశారు. పాటకు తగ్గట్టుగా చేసిన ఎక్స్ప్రెషన్స్, డ్యాన్స్ మూవ్మెంట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అయితే ఆ వీడియోకు అనసూయ ఇచ్చిన క్యాప్షన్ ఇప్పుడు అసలు చర్చకు కారణమైంది. 'కృష్ణుడికి అంతా తెలుసు. నాకు అది చాలు' అంటూ ఆమె పేర్కొన్నారు. అంతేకాదు.. శాంతం, నిగ్రహం, తపస్సు, పవిత్రత, సహనం, సరళత, జ్ఞానం, సాక్షాత్కారం, విశ్వాసం, బ్రహ్మచర్యం వంటి పదాలను కూడా ప్రస్తావించారు. దీంతో తనపై జరుగుతున్న చర్చకు డైరెక్ట్ గా రెస్పాండ్ అవ్వకుండా.. తన నమ్మకాన్ని ఇలా చెప్పారా? అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## తమిళనాడులో అసలైన మార్పు



అన్నమయ్య సినిమాతో తెలుగు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్న కస్తూరి శంకర్.. ఇంటింటి గృహలక్ష్మి సీరియల్ తో తెలుగు బుల్లితెర ప్రేక్షకులను మెప్పించింది. సినిమాలు, సీరియల్స్ లో అద్భుతంగా నటిస్తూ.. భారీ పాపులారిటీ అందుకున్న ఈమె ఇటు సామాజిక అంశాలపై స్పందిస్తూ అంతే వార్తల్లో నిలుస్తోంది. ఇకపోతే తాజాగా నటిస్తూ థియేటర్లలో విడుదలైన చిత్రం ధర్మస్థల నియోజకవర్గం. సాయికుమార్, రాజీవ్ కనకాల, సుమన్ ప్రధాన పాత్రలో వచ్చిన ఈ సినిమా ప్రస్తుతం పాజిటివ్ టాక్ తో థియేటర్లలో దూసుకుపోతోంది. మరోవైపు ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఒక స్పెషల్ ఇంటర్వ్యూలో పాల్గొన్న కస్తూరి శంకర్.. సినిమా కథలపై, ప్రేక్షకుడి విజన్ పై అలాగే తమిళనాడు ముఖ్యమంత్రి విజయ పరిపాలనపై కూడా కామెంట్లు చేసింది.. కస్తూరి శంకర్ మాట్లాడుతూ.." తమిళనాడులో ఒక పెద్ద మార్పు వచ్చింది. ఒకప్పుడు ఎలక్షన్స్ అంటే ఎంతో డబ్బు వెచ్చించాల్సి ఉండేది.. డబ్బులు, మద్యం, బిర్యానీ అంటూ కోట్ల రూపాయలు ఖర్చయ్యేది. అక్కడితో ఆగకుండా డాన్సులు, పాటలు ఆ తమాషాలతో ఒకప్పుడు పోటీ జరిగేది. కానీ ఇప్పుడు అదంతా పోయి.. ఎవరికీ ఏమీ ఇవ్వలేదు. ఇప్పుడు వచ్చారు.. ఎలక్షన్లో గెలిచేసారు. మెజారిటీ అనేది పక్కన పెడితే.. ఒక కొత్త ఆలోచన వచ్చింది.

## ఆనంద్- వైష్ణవి ఇంట్రెస్టింగ్ ముచ్చట్లు

సినిమా ప్రమోషన్లలో భాగంగా నిర్వహించే ప్రత్యేక ఇంటర్వ్యూలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. తాజాగా జరిగిన ఓ సరదా ఇంటర్వ్యూలో ఎపిక్ చిత్రబృందం కాలేజ్ స్టూడెంట్ అనే థీమ్ ఆధారంగా సాగిన చీటీల ఆటలో సందడి చేసింది. సినిమా థీమ్ కి తగ్గట్టే ప్రశ్నలు ఆకట్టుకున్నాయి. ఈ ఫిల్ ఇన్ ది బ్లాంక్స్ సెగ్మెంట్‌లో నటీనటులు- ఇతర సాంకేతిక నిపుణులు తమ కాలేజీ జ్ఞాపకాలను, వినోదాత్మక విషయాలను షేర్ చేస్తూ అభిమానులను అలరించారు. చీటీల గేమ్‌లో హీరోయిన్ వైష్ణవి చైతన్యకు కాలేజ్ స్టూడెంట్... అటెండెన్స్ అనే ప్రశ్న రాగా.. క్షణం కూడా ఆలోచించకుండా 100శాతం అని సమాధానమిచ్చారు. చదువు విషయాల్లో... అకడమిక్స్‌లో తాను చాలా స్ట్రిక్ట్‌గా ఉండేదాన్నని.. రోజూ క్రమం తప్పకుండా కాలేజ్‌కు వెళ్లేదాన్నని వైష్ణవి చెప్పారు.. వైష్ణవి చెప్పిన ఈ సమాధానం తనకు చదువుపై ఉన్న శ్రద్ధను, క్రమశిక్షణను స్పష్టం చేస్తోంది. ఇక హీరో ఆనంద్ దేవరకొండ విషయానికి వస్తే..అదే ప్రశ్న (కాలేజ్ స్టూడెంట్... అటెండెన్స్ ) కు ఆయన తనదైన శైలిలో స్పందించారు. కాలేజ్ విద్యార్థికి కనీసం 75శాతం అటెండెన్స్ ఉండాలని సమాధానమిచ్చారు. అలాగే కాలేజ్ రూల్ .. ఫస్ట్ రూల్ .. అనే ప్రశ్నకు స్పందిస్తూ సమయపాలన చాలా ముఖ్యమని పేర్కొన్నారు. కేవలం మాటల్లోనే కాకుండా, రియల్ లైఫ్‌లో .. షూటింగ్ సెట్స్‌లో కూడా తాను ఎప్పుడూ సరైన సమయానికే హాజరవుతానని ఆనంద్ చెప్పుకొచ్చారు.



## జెన్ జీపై అలాయా కామెంట్

బాలీవుడ్ లో అడుగుపెట్టిన అతి తక్కువ సమయంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న యువ నటి అలాయా ఎఫ్ నేటి తరం ఆలోచనా ధోరణిపై పంచుకున్న అభిప్రాయాలు సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చకు దారి తీశాయి. కెరీర్‌లో రాణించేందుకు లేదా విజయాన్ని అందుకునేందుకు పడే శ్రమ అనేది అనివార్య ప్రక్రియే అయినా కష్టపడటాన్ని మాత్రమే గొప్ప సత్గుణంగా.. భావించే రోజులు పోయాయని అలయా అభిప్రాయపడ్డారు. నేటి జెన్-జీ తరం కష్టపడటం కంటే తెలివైన ప్రణాళిక, ఆత్మరక్షణ , సమతుల్య మైన జీవితానికే ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. సాధారణంగా పాత తరాల్లో నిరంతరం కష్టపడటం, విశ్రాంతి లేకుండా శ్రమించడాన్ని ఏకైక విజయ మంత్రంగా చూసేవారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కష్టపడటమే జీవిత లక్ష్యంగా జీవించడం సమర్థనీయం కాదని, శ్రమతో పాటు సరైన విశ్రాంతి, మానసిక ప్రశాంతత కూడా అంతే ముఖ్యమని జెన్-జీ విశ్వసిస్తోందని వివరించారు.





## నయనతార ఇంట పీవీ సింధు సందడి

భారత బ్యాడ్మింటన్ స్టార్, ఒలింపిక్ విజేత పీవీ సింధు, కోలీవుడ్ లేడీ సూపర్ స్టార్ నయనతార మరియు ఆమె భర్త, దర్శకుడు విఘ్నేష్ శివన్‌లతో చెన్నైలో ఆత్మీయంగా భేటీ అయ్యారు. వీరంతా కలిసి గడిపిన క్షణాలకు సంబంధించిన ఫోటోలను సింధు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడంతో అవి కాస్తా నెట్టింట వైరల్‌గా మారాయి. క్రీడా, సినీ రంగాలకు చెందిన ఈ ప్రముఖుల కలయిక అభిమానులకు కన్నుల పండగలా అనిపిస్తోంది. స్నేహం, ఆత్మీయతలతో కూడిన ఈ అరుదైన సమావేశం ఇప్పుడు అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. నయన్, విఘ్నేష్‌లతో గడిపిన సమయం గురించి సింధు ఒక ఎమోషనల్ నోట్ రాసుకొచ్చారు. "అద్భుతమైన సాయంత్రం, రుచికరమైన ఆహారం, హృదయపూర్వక సంభాషణలు. కొన్ని డిన్నర్లు మనం ప్రజలను చూసే విధానాన్ని మారుస్తాయి. మేం స్నేహితులుగా లోపలికి వెళ్లాము, జీవితం, ప్రేమ గురించి మాట్లాడుకున్నాము.

## బాలీవుడ్‌ను రష్మిక ఏలుతుందా..!



నేషనల్ క్రష్ గా వెలిగిపోతున్న రష్మిక మందన్న మరొక అరుదైన ఘనతను ఖాతాలో వేసుకున్నారు. ప్రముఖ ఆంగ్ల మాధ్యమం నిర్వహించిన మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో దేశంలోనే అత్యంత ఆదరణ పొందిన కథానాయికగా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. సౌత్ నుంచి నార్త్ వరకు వరుస పాన్-ఇండియా విజయాలతో దూసుకుపోతున్న అమ్మడు ఈ రేసులో బాలీవుడ్ , సౌత్ అగ్ర కథానాయికలైన దీపికా పదుకునే, ఆలియా భట్, శ్రద్ధా కపూర్, సాయి పల్లవి వంటి దిగ్గజాలను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని దక్కించుకోవడం విశేషం. దక్షిణాదిలో కిరిక్ పార్టీతో ప్రారంభమైన రష్మిక ప్రయాణం టాలీవుడ్‌లో ఛలో, గీత గోవిందం, సరిలేరు నీకెవ్వరుస, పుష్ప వంటి బ్లాక్‌బస్టర్లతో అగ్ర స్థాయికి చేరింది. అటుపై నెమ్మదిగా హిందీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన కన్నడ భామ గుడ్ బై, మిషన్ మజ్ను చిత్రాలతో నటన పరంగా ప్రశంసలు అందుకున్నారు. ముఖ్యంగా రణ్‌బీర్ కపూర్ సరసన నటించిన యానిమల్ చిత్రం నార్త్ ఇండియాలో సాధించిన సంచలన విజయం ఆమెను బాలీవుడ్ స్టార్ రేసులో ముందంజలో నిలబెట్టింది. ఈ క్రమశిక్షణే నేడు రష్మికను మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో అగ్రస్థానంలో నిలబెట్టింది. ఉత్తరాది ప్రేక్షకుల్లో రష్మికకు ఉన్న ఆదరణ ప్రచార చిత్రాలకు, బ్రాండ్ ఎండోర్స్‌మెంట్లకు, సోషల్ మీడియా రీచ్‌కు దోహదపడుతుంది. బాలీవుడ్ దర్శక, నిర్మాతలు ఆమెను తమ సినిమాల్లోకి తీసుకోవడానికి నేషనల్ క్రేజ్ ఒక ప్రధాన ప్రాతిపదికగా మారుతుంది.



## శ్రీ చరణి అరుదైన రికార్డు

దుబాయ్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ 2026లో భారత జట్టు తన జోరును కొనసాగిస్తోంది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 137 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత క్రీడాకారిణులు అన్ని విభాగాల్లోనూ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా యువ బౌలర్, తెలుగు తేజం శ్రీ చరణి తన అద్భుతమైన బౌలింగ్‌తో ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత ఓవర్లలో 193 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం 194 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన హాంకాంగ్ జట్టు భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేకపోయింది. ముఖ్యంగా శ్రీ చరణి తన స్పెల్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టింది. తన అద్భుతమైన బౌలింగ్‌తో హాంకాంగ్ పతనాన్ని శాసించడంలో కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో కేవలం 3.2 ఓవర్లు బౌలింగ్ చేసిన శ్రీ చరణి, 16 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు కీలక వికెట్లు పడగొట్టింది. ఈ ప్రదర్శనతో ఆమె ఒకే క్యాలెండర్ ఇయర్‌లో భారత మహిళల జట్టు తరఫున అత్యధిక టీ20 వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది. 2026 క్యాలెండర్ ఇయర్‌లో చరణి ఇప్పటివరకు మొత్తం 31 వికెట్లు పడగొట్టింది. ఈ క్రమంలో 2024లో 30 వికెట్లు తీసిన దీప్తి శర్మ రికార్డును ఆమె అధిగమించింది. ప్రస్తుతం ఈ జాబితాలో స్పిన్నర్ పూనమ్ యాదవ్ అగ్రస్థానంలో ఉంది. ఆమె 2018లో 35 వికెట్లు తీసి ఈ రికార్డును నెలకొల్పింది. చరణి ప్రస్తుత ఫామ్ చూస్తుంటే, ఈ ఏడాది ముగిసేలోపు పూనమ్ యాదవ్ రికార్డును కూడా బద్దలు కొట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

**క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక టీ20 వికెట్లు తీసిన భారత బౌలర్లు:**

**35 - పూనమ్ యాదవ్ (2018), 31 - శ్రీ చరణి (2026)**
**30 - దీప్తి శర్మ (2024) , 29 - దీప్తి శర్మ (2022)**
**29 - రాధా యాదవ్ (2024)**






# నేడే హై వోల్టేజీ మ్యాచ్

## ఇండియా-పాక్ మహిళల జట్ల పోరు

మహిళల ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. అభిమానులు అసక్తి కనబరుస్తున్న దాయాదుల మ్యాచ్ శనివారమే జరగనుంది. అంతర్జాతీయ వేదికలపై మాత్రమే తలపడుతున్న ఇరుజట్లు గెలుపుపై ధీమాతో ఉన్నాయి. అయితే.. రికార్డులు మాత్రం టీమిండియా ఆధిపత్యాన్ని స్పష్టం చేస్తున్నాయి. మెగా ఈవెంట్లలో ఒత్తిడికి తలొగ్గే పాక్ పటిష్టమైన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన చేతిలో మరోసారి చతికిలపడడం ఖాయమనిపిస్తోంది. అంతర్జాతీయంగా మరోసారి భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు సమయం ఆసన్నమైంది. ఈసారి మహిళల ఆసియా కప్‌లో దాయాది జట్లు అమీతుమీకి సిద్ధమయ్యాయి. సెప్టెంబర్ 5, శనివారం దుబాయ్ ఇంటర్నేషన్ స్టేడియంలో ఇరుజట్ల మ్యాచ్ ప్రేక్షకులకు ఫుల్ థ్రిల్ ఇవ్వనుంది. ఈమధ్య వరసగా టీ20 ప్రపంచకప్, వన్డే వరల్డ్‌కప్‌లో టీమిండియా చేతిలో కంగుతిన్న పాక్ ప్రతీకారంతో రగిలిపోతోంది. కానీ, పలుమార్లు విజయంతో చిరకాల ప్రత్యర్థి తమకు పోటీయే కాదని నిరూపించిన భారత్ మరోసారి గెలుపుపై ధీమాతో ఉంది. ఈ నేపథ్యంలో.. రికార్డులను తిరగేస్తే.. 14 సార్లు పాక్‌పై మన అమ్మాయిలదే పైచేయి. ఇరుజట్లు 17 పర్యాయాలు ఢీకొనగా.. టీమిండియా 14 దఫాలు విక్టరీ కొట్టింది. ఇక టీ20 ఫార్మాట్లో జరిగిన ఆసియా కప్‌లో ఏకంగా ఆరుసార్లు విజయం మనోళ్లదే. పాక్ చేతిలో ఒకేఒక మ్యాచ్ ఓడింది భారత్. అందుకే కాబోలు.. పాక్‌పై ఎప్పుడైనా మాదే పైచేయి అని ఆల్‌రౌండర్ దీప్తి శర్మ పేర్కొంది. పహల్గాం ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్' అనంతర పరిణామాలతో టాస్ సమయంలో భారత్, పాక్ కెప్టెన్లు షేక్ హ్యాండ్ ఇచ్చుకోవడం లేదు. ఆసియా కప్‌లోనూ అదే తీరుగా వ్యహరిస్తారా? అనేది ఆసక్తి రేపుతోంది.

**భారత స్క్వాడ్ :** స్మృతి మంధాన, షఫాలీ వర్మ, ప్రతీకా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), భారతి ఫుల్‌మాలి, రీచా ఘోష్(వికెట్ కీపర్), దీప్తి శర్మ, ప్రేమా రావత్, నందిని శర్మ, శ్రీ చరణి, క్రాంతి గౌడ్, జి.కమలిని(వికెట్ కీపర్), రేణుకా సింగ్, అరుంధతి రెడ్డి, రాధా యాదవ్.

**పాకిస్థాన్ స్క్వాడ్ :** మునీబా అలీ(వికెట్ కీపర్), షవాల్ జుల్ఫికర్, గుల్ ఫిరోజా, అయేషా జఫర్, సదాఫ్ షమాస్, ఫాతిమా సనా(కెప్టెన్), ఎమ్ ఈ హనీ, ఎమాన్ ఫాతిమా, టుబా హసన్, నష్రా సంధు, సదియా ఇక్బాల్, సైరా జుబీన్, మొమినా రియాసత్, ఎమాన్ నసీర్, వహీదా అక్తర్.



## దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు సిరాజ్, పడిక్కల్

### సెప్టెంబర్ 6న ఈస్ట్‌తో ఫైనల్

దులీప్ ట్రోఫీ ఫైనల్ పోరుకు భారత స్టార్ క్రికెటర్లు మహ్మద్ సిరాజ్, దేవదత్ పడిక్కల్ సిద్ధమయ్యారు. సెప్టెంబర్ 6 నుంచి ఈస్ట్ జోన్‌తో జరగనున్న ఫైనల్ కోసం సౌత్ జోన్ జట్టులో వీరిద్దరికీ చోటు దక్కింది. ఇటీవల శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లోనూ ఇద్దరూ భారత్ తరఫున ఆడారు. ఈ సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకుంది. శ్రీలంక సిరీస్‌లో పడిక్కల్ అద్భుతంగా రాణించాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో 328 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. మరోవైపు సిరాజ్ రెండు టెస్టుల్లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. అయితే దులీప్ ట్రోఫీ ఫైనల్ కోసం వీరిద్దరూ సౌత్ జోన్ జట్టులో ఎవరిని భర్తీ చేస్తారన్నది ఇంకా స్పష్టంగా తెలియలేదు. టీ20 జట్టులో రెగ్యులర్‌గా ఉంటున్న వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ కూడా ఫైనల్‌లో ఆడే అవకాశం ఉందని సమాచారం. సెప్టెంబర్ 10న దులీప్ ట్రోఫీ ఫైనల్ ముగియనుండగా.. సెప్టెంబర్ 13 నుంచి ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. అయినా ఫైనల్‌లో ఆడేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తిలక్ ఇప్పటికే చెప్పాడు. నార్త్ జోన్‌తో సెమీఫైనల్లో తిలక్ తొలి ఇన్నింగ్స్‌లో 116 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 51 పరుగులతో ఆకట్టుకున్నాడు. సౌత్ జోన్ సెమీఫైనల్లో నార్త్‌ను 181 పరుగుల ఛేదనలో ఓడించింది.



## కౌంటీల్లో చాహల్ అదుర్స్

టీమిండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ మరోసారి తన స్పిన్ మాయ చూపించాడు. కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో బెన్ స్టోక్స్‌ను అద్భుతమైన బంతితో బోల్తా కొట్టించాడు. ఆ బంతి వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నార్తాంప్టన్‌షైర్ తరఫున దర్హామ్‌తో మ్యాచ్‌లో ఆడుతున్న చాహల్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. అలెక్స్ లీస్, బెన్ స్టోక్స్, కేసీ ఆల్డ్రిడ్జ్, మాథ్యూ పాట్స్‌ను పెవిలియన్‌కు పంపించాడు. చాహల్ ధాటికి నార్తాంప్టన్‌షైర్ తొలి ఇన్నింగ్స్‌లో 20 పరుగుల ఆధిక్యం సాధించింది. స్టోక్స్‌ను అవుట్ చేసిన బంతే ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఆఫ్ స్టంప్ వెలుపల నుంచి వచ్చిన బంతి ఒక్కసారిగా షార్ప్ టర్న్ తీసుకుంది. స్టోక్స్ అంచనా వేయలేకపోయాడు. బంతి నేరుగా స్టంప్‌లను ఎగరగొట్టింది. చాహల్ వేసిన ఈ అద్భుతమైన డెలివరీని చూసిన అభిమానులు అతడి స్పిన్ మాయపై ప్రశంసలు కురిపిస్తున్నారు. కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో ప్రస్తుతం పలువురు భారత ఆటగాళ్లు ఆడుతున్నారు. కుల్దీప్ యాదవ్, అఖీబ్ నబీ, రాహుల్ చాహర్ కూడా తమ జట్ల తరఫున బరిలో ఉన్నారు. భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ఇటీవల ఐదుగురు అత్యుత్తమ భారత బౌలర్ల జాబితాను వెల్లడించాడు. ఇందులో చాహల్‌కు నాలుగో స్థానం ఇచ్చాడు. భువనేశ్వర్ కుమార్‌ను తొలి స్థానంలో ఉంచాడు. మహ్మద్ షమీకి రెండో స్థానం, కుల్దీప్ యాదవ్‌కు మూడో స్థానం ఇచ్చాడు. రవిచంద్రన్ అశ్విన్‌ను ఐదో స్థానంలో ఎంపిక చేశాడు. జస్‌ప్రీత్ బుమ్రాకు ఈ జాబితాలో చోటు దక్కలేదు. భువనేశ్వర్ తన వ్యక్తిగత అభిమాన బౌలర్ అని అర్ష్‌దీప్ చెప్పాడు. కొత్త బంతితో అతడు చూపించే నియంత్రణ తనను ఎంతగానో ఆకట్టుకుంటుందని తెలిపాడు.

## 22న టీమిండియా-జపాన్ టీ20 మ్యాచ్

భారత్, జపాన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు నెలకొని 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఈ మైత్రిని మరింత బలోపేతం చేసే దిశగా ఒక చారిత్రక క్రికెట్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. భారత్, జపాన్ దేశాల పురుషుల జట్ల మధ్య ఈ నెలలో ఒక ప్రత్యేక టీ20 అంతర్జాతీయ మ్యాచ్ జరగనుంది. 'సుజుకి కప్' పేరుతో జరగనున్న ఈ మ్యాచ్‌కు సెప్టెంబర్ 22న జపాన్‌లోని టోచిగి ప్రిఫెక్చర్‌లో ఉన్న సానో అంతర్జాతీయ క్రికెట్ గ్రౌండ్ ఆతిథ్యం ఇవ్వనుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనే తకైచి మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన 'స్పోర్ట్ 75' ఒప్పందంలో భాగంగా ఈ మ్యాచ్‌ను నిర్వహిస్తున్నారు. ఇరు దేశాల మధ్య క్రీడా సంబంధాలను, సాంస్కృతిక సహకారాన్ని ప్రోత్సహించడమే ఈ ఒప్పందం యొక్క ప్రధాన లక్ష్యం.



ఈ చారిత్రక మ్యాచ్‌పై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి దేవజిత్ సైకియా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "ఈ చారిత్రక ఘట్టంలో భాగం కావడం బీసీసీఐకి ఎంతో ఆనందంగా ఉంది. ఇది క్రికెట్‌కు చాలా ముఖ్యమైన క్షణం. భారత జట్టును జపాన్‌కు తీసుకెళ్లడం ద్వారా తూర్పు ఆసియాలో ఈ క్రీడను విస్తృత ప్రేక్షకులకు పరిచయం చేసే అవకాశం లభిస్తుంది" అని ఆయన తెలిపారు. భారత్-జపాన్ మధ్య బలమైన స్నేహ బంధం ఉందని, ఈ వేడుకల్లో క్రికెట్‌ను భాగం చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సంప్రదాయ దేశాలు దాటి ప్రపంచవ్యాప్తంగా క్రికెట్‌ను విస్తరించే బాధ్యత తమపై ఉందని, ఈ దిశగా జపాన్ క్రికెట్ అసోసియేషన్ (జేసీఏ)తో కలిసి పనిచేస్తామని సైకియా వివరించారు. మరోవైపు, జపాన్ క్రికెట్ అసోసియేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నవోకి మియాజీ మాట్లాడుతూ, "ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్లను జపాన్‌లో మా సొంత గడ్డపైకి ఆహ్వానించడం మా అసోసియేషన్‌కు ఒక చారిత్రక ఘట్టం. ఈ లక్ష్య సాధనకు సహకరించిన బీసీసీఐకి ధన్యవాదాలు" అని అన్నారు. భారత క్రికెట్ అభిమానుల ఉత్సాహానికి స్వాగతం పలుకుతున్నామని, స్థానిక జపనీయులు కూడా పెద్ద సంఖ్యలో వచ్చి తమ జట్టును ప్రోత్సహించాలని కోరారు. ఈ మ్యాచ్‌కు అభిమానుల తాకిడి అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్న నిర్వాహకులు, సానో మైదానం సామర్థ్యాన్ని 500 నుంచి 2,000కు పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలోనే అధికారిక సోషల్ మీడియా ఛానెళ్లలో టికెట్ల అమ్మకాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 24 నుంచి జపాన్‌లో ప్రారంభం కానున్న ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు భారత క్రికెట్ జట్టు అక్కడికి వెళుతున్న నేపథ్యంలో ఈ ప్రత్యేక మ్యాచ్‌ను ఏర్పాటు చేశారు. ఆసియా క్రీడల కోసం భారత జట్టుతో పాటు నెట్ బౌలర్లుగా లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ విక్కీ ఓస్త్వాల్, పేసర్లు రసిఖ్ సలామ్, కార్తీక్ త్యాగి కూడా జపాన్‌కు వెళ్లనున్నారు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతి వీవీఎస్ లక్ష్మణ్ పర్యవేక్షణలో ఉన్న ఈ ముగ్గురు యువ బౌలర్లకు ఇది మంచి అవకాశమని, వారి పాస్‌పోర్ట్, వీసా ప్రక్రియలు కొనసాగుతున్నాయని బీసీసీఐ వర్గాలు తెలిపినట్లు ఐఏఎన్ఎస్ తన కథనంలో పేర్కొంది.





## వైభవ్‌పై కన్నేసి ఉంచాం: బీసీసీఐ

భారత క్రికెట్‌లో సంచలనం సృష్టిస్తున్న యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై బీసీసీఐ ప్రత్యేక దృష్టి పెట్టింది. అతడి కెరీర్ ఒక్క సిరీస్, ఒక్క ఏడాదికే పరిమితం కాకుండా సుదీర్ఘంగా సాగాలని బోర్డు భావిస్తోంది. వైభవ్‌తో పాటు ప్రతిభ చూపుతున్న యువ ఆటగాళ్లకు సరైన మార్గదర్శకత్వం, సహకారం అందించాలని నిర్ణయించింది. ముంబైలో గురువారం బీసీసీఐ కీలక సమీక్ష సమావేశం నిర్వహించింది. కార్యదర్శి దేవజిత్ సైకియా, టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, సీవోఈ చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సమావేశం తర్వాత వైభవ్‌పై బీసీసీఐ ఆలోచనను సైకియా స్పష్టం చేశారు. 15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ఆటగాడిని ఎంతో జాగ్రత్తగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. సచిన్ టెండూల్కర్‌లా వైభవ్ సూర్యవంశీ దేశానికి సుదీర్ఘకాలం సేవలందించే ఆటగాడిగా ఎదగాలని బీసీసీఐ కోరుకుంటోందని చెప్పారు. అతడి కెరీర్‌ను ప్రతి దశలోనూ నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు. ఇటీవలే వైభవ్ 15 ఏళ్ల 157 రోజుల వయసులో దులీప్ ట్రోఫీ చరిత్రలో అత్యంత పిన్న వయసులో అర్ధశతకం చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 57 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు. జింబాబ్వేతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 151 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. భారత్ ఆ సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో భారత్ తరఫున అత్యంత పిన్న వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఆటగాడిగా వైభవ్ నిలిచాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున అతడు 776 పరుగులు చేశాడు. 237.30 స్ట్రైక్‌రేట్‌తో ఆడాడు. ఒక సెంచరీ, ఐదు అర్ధశతకాలు బాదాడు. 72 సిక్సర్లతో టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అండర్-19 ప్రపంచకప్‌లోనూ వైభవ్ 439 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్ అవార్డు అందుకున్నాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
శనివారం 5-9-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

## పిచ్చి పరాకాష్టకు!

తెలంగాణ రాజకీయాల్లో మరో వింత దృశ్యం ఆవిష్కృతం కానుంది. ప్రతిపక్షం ధర్నాలు చేయడం సహజం. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రతిపక్షాల బాధ్యత. కానీ అధికారంలో ఉన్న పార్టీనే ధర్నాకు కూర్చొని, ప్రతిపక్ష నేత రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం మాత్రం రాజకీయాల్లో కొత్త నిర్వచనానికి నాంది పలుకుతోంది. కేసీఆర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ మహాధర్నాకు పిలుపునివ్వడం ఈ కోవలోకే వస్తుంది. అధికారం ఎవరి చేతిలో ఉంది? ప్రభుత్వం ఎవరిది? నిర్ణయాలు తీసుకునే అధికారం ఎవరిది? ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిది? ఈ ప్రశ్నలకు సమాధానం చాలా సులభం. అధికారంలో ఉన్నది కాంగ్రెస్. పాలన సాగించాల్సింది కాంగ్రెస్ ప్రభుత్వం. మరి కేసీఆర్ రాజీనామా చేయాలని అధికార పార్టీ రోడ్డెక్కాల్సిన అవసరం ఏమొచ్చింది? ప్రతిపక్ష నాయకుడు రాజీనామా చేయాలని అధికార పార్టీ డిమాండ్ చేయడం కంటే, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రజలు అధికార పార్టీని డిమాండ్ చేయడం సహజం. నిరుద్యోగులకు ఉద్యోగాలు, రైతులకు భరోసా, మహిళలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు మద్దతు, ఇళ్ల నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, ధరల నియంత్రణ, అభివృద్ధి.. ఇవన్నీ ప్రభుత్వ పనితీరును కొలిచే అసలు ప్రమాణాలు. ప్రజలు ఓటు వేసింది ధర్నాలు చేయడానికి కాదు.. పాలన చేయడానికి. ప్రతిపక్షాన్ని తిట్టడానికి కాదు.. ప్రజల జీవితాలను మార్చడానికి. గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ అధికారంలోకి వచ్చిన పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా గత ప్రభుత్వాన్నే తన రాజకీయ కేంద్రబిందువుగా చేసుకుంటే, అది పాలనా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నంగానే కనిపిస్తుంది. కేసీఆర్ తప్పులు చేసి ఉంటే ప్రజలు తీర్పు చెప్పారు. ఆయన పాలనపై విమర్శలు ఉంటే వాటిని రాజకీయంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కోవచ్చు. చట్టపరమైన తప్పిదాలు ఉంటే దర్యాప్తు సంస్థలు తమ పని తాము చేసుకోవచ్చు. కానీ ప్రభుత్వం తన బాధ్యతలను పక్కనపెట్టి ప్రతిపక్ష నేత రాజీనామా చేయాలని రోడ్డెక్కడం ప్రజలకు ఏం సంకేతం ఇస్తుంది? అధికారంలో ఉన్నవారు ప్రతిరోజూ ప్రతిపక్షాన్ని లక్ష్యంగా చేసుకుంటూ ఉంటే, పాలన ఎప్పుడు చేస్తారు? ప్రజల సమస్యలపై దృష్టి ఎప్పుడు పెడతారు? ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై సమాధానం ఎప్పుడు చెబుతారు? ప్రజాస్వామ్యంలో అధికార పక్షానికి ఐదేళ్ల అవకాశం ఉంటుంది. ఆ అవకాశం ప్రతిపక్షంపై పోరాటం చేయడానికి కాదు.. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి. ప్రతిపక్షాన్ని ఎదుర్కోవడం రాజకీయ వ్యూహం కావచ్చు. కానీ ప్రతిపక్షమే తమ పాలనకు ప్రధాన అజెండాగా మారితే మాత్రం అది అధికార పక్షం ఆత్మవిశ్వాసంపై అనుమానాలు కలిగిస్తుంది. నిన్నటి పాలకులను ప్రశ్నించడం తప్పు కాదు. కానీ నేటి పాలకులు నిన్నటి పాలకులనే ప్రశ్నిస్తూ కాలం గడపడం మాత్రం ప్రజలకు సమాధానం కాదు. ప్రజలకు కావాల్సింది ఎవరు రాజీనామా చేయాలనే రాజకీయ నాటకం కాదు.. ఎవరు తమ బాధ్యత నిర్వర్తిస్తున్నారనే స్పష్టత. అధికారంలో ఉండి ధర్నా చేయాల్సిన పరిస్థితి వస్తే, అది ప్రతిపక్షం బలహీనత కాదు.. అధికార పక్షం పాలనా స్థితిగతులపై ప్రశ్న. ప్రభుత్వం ధర్నా చేయడం కాదు.. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలి. ప్రతిపక్షాన్ని కూల్చడం కాదు.. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి. రాజకీయ పిచ్చి పరాకాష్టకు చేరితే ధర్నాలు పెరుగుతాయి.. కానీ పాలన మాత్రం తగ్గిపోతుంది. తెలంగాణ ప్రజలు కోరుకునేది ఇది కానే కాదు.



## గురువుకు వందనం

క్షీరము నిచ్చేది ధేనువు
జ్ఞానము నిచ్చేది గురువు
దేవ గురువు బృహస్పతి
గురుదేవుడేప్పుడూ సరస్వతే!!

అజ్ఞానం నుండి విజ్ఞానం వైపు నడిపించేది గురువు
మంచి మనిషిగా తీర్చిదిద్దేది గురువు
మంచిని బోధించేది గురువు
గురువు లేని విద్య గుడ్డి విద్య!!

విజ్ఞానం పంచేది గురువు
తన విద్యను ధారపోసేది గురువు
ప్రపంచంలో అన్నిటికీ రెండు కొమ్ములే ఉంటే
మూడు కొమ్ములు ఉన్నవాడు గురువు!!

గు=1 రు =2 వు =3
జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా..



దేవులపల్లి రమేశ్
తెలుగు ఉపాధ్యాయులు,
మహాత్మా జ్యోతిభా పూలే
గురుకుల పాఠశాల
9963701294

# ఎక్కడ భార్యాభర్తల బంధం?

## వివాహం బంధమా? బేరమా?.. కలిసి జీవించడానికా? విడిపోయేందుకు ఒప్పందమా?

నిన్నటి వరకు జీవితాంతం తోడుగా ఉంటానని ప్రమాణం చేసిన భార్యాభర్తలే నేడు ఒకరి ప్రాణాలకు మరొకరు శత్రువులవుతున్నారు. భర్తలను భార్యలు హత్య చేస్తున్న ఘటనలు.. భార్యలను భర్తలు కడతేర్చుతున్న దారుణాలు.. విడాకుల కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్న దంపతులు.. పిల్లలను ఎవరు తీసుకోవాలనే పేచీలు.. ఆస్తులు, భరణం, పరువు, అనుమానాలు, అక్రమ సంబంధాలు.. చివరకు రక్తపాతంగా మారుతున్న కుటుంబ కలహాలు!



### ఇది ఏ సమాజం?
### ఇది ఏ బంధం?
### ఇది ఏ విలువల పతనం?

భార్యాభర్తల మధ్య అభిప్రాయ భేదాలు కొత్తవి కావు. గొడవలు కూడా కొత్తవి కావు. కానీ ఒకప్పుడు గొడవ తర్వాత పెద్దలు కూర్చోబెట్టి మాట్లాడేవారు. కోపం చల్లారే వరకు ఎదురు చూసేవారు. 'కాపురం నిలబడాలి' అనే ఆలోచన ఉండేది. ఇప్పుడు మాత్రం 'నాకు నచ్చలేదు.. విడిపోదాం' అన్న మాట చాలా సులభమైపోయింది. అంతకంటే ప్రమాదకరంగా, 'నాకు దక్కనిది మరెవరికీ దక్కకూడదు' అనే ప్రతీకార భావన కొందరిలో ప్రాణాలు తీసే స్థాయికి చేరుతోంది. ఇటీవల దేశంలో చోటుచేసుకున్న వరుస ఘటనలు ఈ భయానక వాస్తవాన్ని మన కళ్ల ముందుంచుతున్నాయి. ఢిల్లీలో దాంపత్య వివాదాల మధ్య ఓ యువతి హత్యకు గురైన ఘటన కలచివేస్తే.. లక్నోలో విడాకుల ఆర్థిక వివాదం నేపథ్యంలో జరిగిన హత్యాకాండ మరింత ఆందోళన కలిగిస్తోంది. అయితే ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. భార్యపై హింసైనా, భర్తపై హింసైనా అది హింసే. హత్యకు లింగం ఉండదు. బాధితుడికి న్యాయం అవసరం. మహిళలపై జరుగుతున్న గృహహింస, వరకట్న వేధింపులు, హత్యలు ఎంత తీవ్రమైన నేరాలో.. పురుషులపై జరుగుతున్న హింసను కూడా అంతే తీవ్రంగా చూడాల్సిందే. 2024లో దేశంలో 5,737 వరకట్న మరణాలు నమోదయ్యాయని ఎన్‌సీఆర్‌బీ గణాంకాలను ఉటంకిస్తూ నివేదికలు పేర్కొంటున్నాయి.

**చట్టం రక్షణ ఇవ్వాలి..**
**ప్రతీకారానికి ఆయుధం కాకూడదు.**
**వివాహం హక్కుల పోరాటంగా మారకూడదు.**

ఈ రోజుల్లో సామాజిక మాధ్యమాలు, వ్యక్తిగత స్వేచ్ఛ, ఆర్థిక స్వాతంత్ర్యం, మారుతున్న జీవనశైలి.. ఇవన్నీ సమాజానికి అవసరమైన మార్పులే. కానీ స్వేచ్ఛ అంటే బాధ్యతల నుంచి విముక్తి కాదు. సమానత్వం అంటే పరస్పర గౌరవం లేకపోవడం కాదు. హక్కులు అంటే ఎదుటివారి హక్కులను తొక్కేయడం కాదు. వివాహాన్ని కాపాడటం పేరుతో హింసను భరించమని చెప్పడం కూడా తప్పే. అదే సమయంలో చిన్నచిన్న అపార్థాలకు, అహంకారాలకు, కుటుంబ జోక్యాలకు, సామాజిక మాధ్యమాల ప్రభావానికి బంధాన్ని బలి చేయడం కూడా సమాజానికి ప్రమాదకరం.

**విడాకులు తప్పు కాదు.**
**హింసను భరించడం ధర్మం కాదు.**
**కానీ హత్య పరిష్కారం కాదు.**

సంబంధం ముగిసిపోతే చట్టబద్ధంగా విడిపోవచ్చు. న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు. మధ్యవర్తిత్వాన్ని ఆశ్రయించవచ్చు. కానీ ప్రాణం తీసే హక్కు ఎవరికీ లేదు. ఇటీవల సుప్రీంకోర్టు కూడా పరస్పర అంగీకారంతో విడాకుల తర్వాత పరిష్కరించిన క్లెయిమ్‌లను తిరిగి తెరవడంపై స్పష్టత ఇచ్చింది. దాంపత్య వివాదాలు ఎంత సంక్లిష్టమైనవైనా, వాటికి చట్టపరమైన పరిష్కార మార్గాలున్నాయనే విషయం ఇటువంటి తీర్పులు గుర్తుచేస్తున్నాయి. అసలు సమస్య కోర్టుల్లో కాదు.. మనసుల్లో మొదలవుతోంది. పెళ్లికి ముందు ఎన్నో రోజులు మాట్లాడుకుంటారు. పెళ్లి తర్వాత మాత్రం ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి సమయం ఉండదు. ఫోన్‌లో గంటలకొద్దీ గడిపే దంపతులు.. ఎదురెదురుగా కూర్చొని పది నిమిషాలు మాట్లాడుకోలేని పరిస్థితి. ప్రేమ కంటే అనుమానం ఎక్కువ. నమ్మకం కంటే నిఘా ఎక్కువ. సంభాషణ కంటే ఆరోపణలు ఎక్కువ. పరస్పర గౌరవం కంటే 'నేనే గెలవాలి' అనే అహంకారం ఎక్కువ. ఇదే దాంపత్య పతనానికి అసలు కారణం. కుటుంబ వ్యవస్థను కాపాడాలంటే పాతకాలపు మూఢనమ్మకాలను కాదు.. పాతకాలపు బాధ్యత, సహనం, పరస్పర గౌరవం, పెద్దల సలహా, బంధాల విలువ వంటి మంచితనాన్ని తిరిగి తీసుకురావాలి. పిల్లల ముందే తల్లిదండ్రులు ఒకరినొకరు తిట్టుకుంటే.. ఆ పిల్లలు ప్రేమను ఎలా నేర్చుకుంటారు? ఇంట్లో ప్రతిరోజూ పోలీసు కేసులు, కోర్టు కేసులు, ఆరోపణలు, ప్రతీకారాలే కనిపిస్తే.. కుటుంబం అనే పదానికి వారికి ఏ అర్థం మిగులుతుంది?

భార్యాభర్తలు ప్రత్యర్థులు కాదు. భాగస్వాములు. ఒకరి మీద ఒకరు కేసులు పెట్టుకోవడానికి కాదు.. ఒకరి జీవితాన్ని మరొకరు నిలబెట్టడానికి వివాహం. ఒకరి బలహీనతను మరొకరు ఆయుధంగా మార్చుకోవడానికి కాదు.. ఒకరి బలహీనతకు మరొకరు బలంగా నిలవడానికి వివాహం. ఈ రోజు మనం ఒకసారి ఆగి ఆలోచించాలి. పెళ్లి ఫోటోల్లో చిరునవ్వులు ఉన్నాయి.. కాపురాల్లో ఎందుకు కత్తులు మెరుస్తున్నాయి? ఏడు అడుగులు వేసిన వారు.. ఏడాది తిరగకముందే కోర్టు మెట్లు ఎందుకు ఎక్కుతున్నారు? జీవితాంతం తోడుంటామని ప్రమాణం చేసిన వారు.. ఒకరి జీవితాన్నే ఎందుకు అంతం చేస్తున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానం చట్టాల్లో మాత్రమే లేదు. మన సంస్కారంలో ఉంది. మన పెంపకంలో ఉంది. మన కుటుంబాల్లో ఉంది. ముఖ్యంగా మనిషి విలువను మనిషి గుర్తించడంలో ఉంది. వివాహాన్ని స్వర్గంగా మార్చాల్సిన బాధ్యత భార్యదొక్కరిది కాదు.. భర్తదొక్కరిది కాదు. ఇద్దరిదీ. బంధం నిలబడకపోతే విడిపోవచ్చు. నీ బంధం విఫలమైందని మనిషి విఫలమవ్వాల్సిన అవసరం లేదు. విడాకులు జీవితానికి ముగింపు కాదు. అలాగే హత్య ఎవరి సమస్యకూ పరిష్కారం కాదు. కాపురం కలిసుండటమే గొప్ప కాదు.. కలిసి ఉన్నంతకాలం ఒకరినొకరు మనుషులుగా గౌరవించుకోవడమే అసలు దాంపత్యం. ఇది గుర్తించకపోతే రేపటి సమాజంలో పెళ్లిళ్లు ఉంటాయి.. కుటుంబాలు ఉండవు. భార్యలు ఉంటారు.. భర్తలు ఉంటారు.. కానీ భార్యాభర్తల బంధం మాత్రం ఉండదు. అప్పుడు మనం అడగాల్సిన ప్రశ్న ఒక్కటే.. ఎక్కడ భార్యాభర్తల బంధం? విడాకుల కోసమే సంబంధమా?

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.